


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 11.07.2026 | సంపుటి: 3 | సంచిక: 159 | పేజీలు: 8 | వెల: 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 11.07.2026 | VOLUME : 3 | ISSUE : 159 | PAGES: 8 | COST: 2/- |

## రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం.. భట్టి విక్రమార్క



- రెండున్నర ఏళ్లలో మహిళలకు రూ.67 వేల కోట్ల రుణాలు
- కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్‌పై డిప్యూటీ సీఎం విమర్శలు

2

## కాళేశ్వరం విషయంలో రైతుల ప్రయోజనాలే ప్రధానం: ఈటల రాజేందర్

- రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచన
- మేడిగడ్డలో నీటి నిల్వ కాదు.. వృథా నీటిని ఎత్తిపోసాలని డిమాండ్
- అవినీతిపై చర్యలు తీసుకుంటూనే రైతులకు నీరు అందించాలని విజ్ఞప్తి



హైదరాబాద్, జూలై10( రాజముద్ర న్యూస్)

"కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రాజకీయాలు పక్కనపెట్టి రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలి. మేడిగడ్డలో నీటిని నిల్వ చేయాలని మేము కోరడం లేదు. ప్రస్తుతం నదిలో వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని మాత్రమే ఎత్తిపోసి రైతులకు అందించాలి" అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సికింద్రాబాద్‌లో

మిగతా 2వ పేజీలో..




# కాచుకో కేసీఆర్..

వచ్చే ఎన్నికల్లో తుడిచిపెట్టేస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

- 2029లో తెలంగాణలో 182 అసెంబ్లీ స్థానాలు ఉంటాయని వ్యాఖ్య
- 117 స్థానాల్లో కాంగ్రెస్‌దే విజయం అని ధీమా
- భద్రాచలం సాక్షిగా కేసీఆర్‌కు సవాల్

ఖమ్మం, జూలై10( రాజముద్ర న్యూస్)

"కాచుకో కేసీఆర్.. నీ బలగమంతా ఈ మాట గుర్తుపెట్టుకోండి. భద్రాచలం సీతారామచంద్ర స్వామి సాక్షిగా చెబుతున్నా.. వచ్చే ఎన్నికల్లో మిమ్మల్ని పూర్తిగా తుడిచిపెట్టేస్తాం. 2029 నాటికి తెలంగాణలో 182 అసెంబ్లీ స్థానాలు ఏర్పడతాయి. అందులో 117 స్థానాల్లో కాంగ్రెస్‌దే విజయం" అని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించిన కాంగ్రెస్ రైతు ఆశీర్వాద సభలో మాట్లాడిన ఆయన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయాల నుంచి ప్రజలు తిరస్కరిస్తారని, కాంగ్రెస్ కార్యకర్తలు తమ లక్ష్యం నెరవేరే వరకు విశ్రమించరని అన్నారు.

మిగతా 2వ పేజీలో..

## రైతు భరోసా కింద మరో రూ.1,009 కోట్లు విడుదల

- రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మొత్తం సాయం రూ.8,759 కోట్లకు చేరిక
- 74 లక్షల మంది రైతులకు లబ్ధి

2



## ప్రతిభ, పరిశ్రమలకు అనుకూల వాతావరణం

- కండూ ఏఐ హెడ్‌క్వార్టర్స్‌ను ప్రారంభించిన కేటీఆర్




హైదరాబాద్, జూలై10( రాజముద్ర న్యూస్)

హైదరాబాద్‌లో ప్రముఖ సెమీకండక్టర్ సంస్థ కండూ ఏఐ ఏర్పాటు చేసిన ఇండియా చిప్ డిజైన్ హెడ్‌క్వార్టర్స్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మిగతా 3వ పేజీలో..



## ఓఆర్ఆర్‌పై ఏఐతో ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- 80 ప్రమాద ప్రాంతాల గుర్తింపు
- అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ: సజ్జనార్

3

## తయారీ రంగానికి అత్యంత అనుకూలం

- పెట్టుబడులకు జర్మన్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి
- జర్మనీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, జూలై10( రాజముద్ర న్యూస్)

తయారీ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా జర్మనీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ అత్యున్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక విధానాలు,

మిగతా 2వ పేజీలో..

2

## ఏసీబీ పేరిట బెదిరింపులు

- రెవెన్యూ అధికారిని బురిడీ కొట్టించిన సైబర్ కేటుగాళ్లు
- కేసు నమోదు చేస్తామంటూ భయపెట్టి రూ.లక్ష కాజేత
- సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు.. కేసు నమోదు చేసి దర్యాప్తు

## పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందా?

- కన్నెపల్లినుంచి నీటిని లిఫ్ట్ చేయకపోవడం ప్రభుత్వ అసమర్థత
- హైదరాబాద్‌కు నీటి సమస్య వస్తే ఎట్లా పరిష్కరిస్తారు?
- సుందిళ్లనుంచి ఎల్లంపల్లికి నీరెందుకు తరలించరు?
- మళ్లీ జలదోపిడీకి తలుపులు తెరిచారు
- ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన హరీష్‌రావు

3



## అత్తాపూర్‌లో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు



- ఎండీఎంఏ డ్రగ్స్, భారీ సంఖ్యలో ఇంజెక్షన్ల స్వాధీనం
- ఇద్దరి అరెస్ట్.. ప్రాణాంతక ఆయుధాలు కూడా స్వాధీనం

2

## స్వరాష్ట్ర సాధనలో కార్మిక సంఘాలదే కీలక పాత్ర

- ట్రేడ్ యూనియన్ల పోరాటాన్ని కొనియాడిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీ

హైదరాబాద్, జూలై10( రాజముద్ర న్యూస్)

స్వరాష్ట్ర సాధనలో ట్రేడ్ యూనియన్ల పాత్ర అత్యంత కీలకమైనదని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ముక్తకంఠంతో కొనియాడింది. నాడు ఆర్టీసీ, సింగరేణి, రైల్వే, బీఎస్ఎన్ఎల్, టీజేఏసీ ఉద్యోగులతోపాటు అసంఘటిత రంగ కార్మికులు రోడ్లపైకి వచ్చి సకల జనుల సమ్మె ద్వారా యావత్ ప్రభుత్వ యంత్రాంగాన్ని స్తంభింపజేయడం వల్లే నాటి దిల్లీ పీఠం దిగివచ్చిందని గుర్తు చేసింది. కార్మిక లోకం అందించిన ఆ చరిత్రాత్మక మద్దతు లేకపోతే తెలంగాణ కల సాకారం అయ్యేది కాదని, అందుకే ఉద్యమ

మిగతా 2వ పేజీలో..





## పీకే ఓసీ2 డీప్ సైడ్ సింగరేణికే కేటాయించాలి

- బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని కూడా ఇవ్వాలి
- రూ.54 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- 20న రామగుండంలో నిరసన దీక్ష
- టీఆర్ఎస్ చీఫ్ కవిత

3

# రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం.. భట్టి విక్రమార్క

**ఖమ్మం, జూలై 10**

"గత ప్రభుత్వం రైతు బంధు నిధుల కోసం రైతులను 169 రోజులు తిప్పించేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్ల పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తూ రైతును రాజులా చూస్తున్నాం" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతు భరోసా పథకం కింద కొత్తగా రూ.1,009 కోట్ల నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేసిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన భట్టి విక్రమార్క, ఆ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 74 లక్షల మంది రైతులకు, 1.45 కోట్ల ఎకరాల సాగు భూమికి మొత్తం రూ.8,759 కోట్ల పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న ఆయన, రెండున్నర ఏళ్లలో మహిళలకు రూ.67 వేల కోట్ల రుణాలు అందించామని చెప్పారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పండించిన ప్రతి గింజకు మద్దతుగా కొనుగోళ్లు చేపడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు ఇప్పటికీ నిలకడగా ఉన్నాయని, అయితే రూ.27 వేల కోట్లతో పూర్తయ్యే కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయాన్ని రూ.1.47 లక్షల కోట్లకు పెంచి చివరకు దానిని దెబ్బతీశారని ఆరోపించారు. హరీష్ రావు వాస్తవాలను వక్రీకరిస్తూ మాట్లాడుతున్నారని విమర్శించిన భట్టి, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వాటి వడ్డీలు చెల్లిస్తూనే ఉద్యోగుల బిల్లులు క్లియర్ చేసి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలను మోసం చేసిన నాయకులను ప్రజలు ఇక నమ్మరని, మళ్లీ మాయమాటలతో ప్రజల ముందుకు వస్తే కాంగ్రెస్ కార్యకర్తలు గట్టిగా తిప్పికొడతారని హెచ్చరించారు.

# బోనాల ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, జూలై 10**

"హైదరాబాద్‌లో నిర్వహించే ఆషాఢ బోనాల ఉత్సవాలు తెలంగాణ గంగా-జమున సంస్కృతికి ప్రతీక. లక్షలాది మంది భక్తులు హాజరయ్యే ఈ ఉత్సవాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సంపూర్ణ సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి" అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. గోల్కొండ కోటలోని జగదాంబిక మహంకాళి ఆలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోనాల జాతర పోస్టర్, బ్రోచర్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే గోల్కొండ బోనాల ఉత్సవాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. భక్తులకు ట్రాఫిక్, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అగ్నిమాపక సదుపాయాలు, ప్రత్యేక బస్సులు, క్యూ లైన్లు, బారికేడ్లు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. జూలై 16న లంగర్‌హౌస్ కూడలి నుంచి ప్రారంభమయ్యే తొలి బోనం, తొట్టెల ఊరేగింపు, రథోత్సవం, మెట్ల పూజకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖలను సూచించారు. దేవాలయ పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, మొబైల్ మరుగుదొడ్లు, తాగునీటి కేంద్రాలు, వైద్య శిబిరాలు, అత్యవసర అంబులెన్స్ సేవలు నిరంతరం అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. గోల్కొండ కోట పరిధిలోని రహదారులు, మెట్లు, విద్యుత్ దీపాలు, సూచిక బోర్డులు, విశ్రాంతి షెడ్లు వంటి సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని చెప్పారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొనే శివసత్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, భక్తుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. అవసరమైతే పోలీసు నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గోల్కొండ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహోత్సవమని మంత్రి పేర్కొన్నారు. భక్తులు అమ్మవారిని సౌకర్యవంతంగా దర్శించుకుని సంతృప్తిగా ఇళ్లకు చేరేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. సమావేశం అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని జగదాంబిక మహంకాళి అమ్మవారిని ప్రార్థించారు.

# స్వరాష్ట్ర సాధనలో కార్మిక సంఘాలదే కీలక పాత్ర

**మొదటిపేజీ తరువాయి**

చరిత్రలో వారికి అగ్రతాంబూలం దక్కుతుందని కమిటీ స్పష్టం చేసింది. ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల స్మారక చిహ్నం మొదటి అంతస్తులో శుక్రవారం జరిగిన ముఖాముఖి సంప్రదింపుల ప్రక్రియలో కమిటీ ఛైర్మన్ డాక్టర్ కె.కేశవరావు, సభ్యులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ (ఎమ్మెల్సీ), అద్దంకి దయాకర్ (ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్), ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మోతె శోభన్ రెడ్డి, ఎస్.రాములు నాయక్ కార్మిక సంఘాల పాత్రపైనే ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు, అసంఘటిత రంగ కార్మిక శ్రేణులు కమిటీకి తమ వినతులను సమర్పించారు.

**ఉద్యమకారుల ప్రధాన వినతులు, డిమాండ్లు**

1969 నాటి ఉద్యమకారులతోపాటు హాజరైన వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు తమ ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరుతూ ప్రధాన డిమాండ్లను రాతపూర్వకంగా సమర్పించారు. నాడు పోరాడిన ప్రతి కార్మిక యోధునికి, ఉద్యమకారునికి ప్రభుత్వ ముద్రతో కూడిన అధికారిక ప్రశంసా పత్రాలు అందించి గౌరవించాలి. అర్హులైన ప్రతి ఉద్యమకారుడి కుటుంబానికి నివాస అవసరాల నిమిత్తం 250 గజాల భూమిని ప్రభుత్వం కేటాయించాలి. ఉద్యమకారులకు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ ఉచిత వైద్యం అందేలా ప్రత్యేక హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. వృద్ధాప్యంలో ఉన్న ఉద్యమకారుల జీవన భృతి కోసం శాశ్వత ప్రాతిపదికన నెలవారీ పెన్షన్ అందించాలని, ఉచిత రవాణా సదుపాయం కల్పించాలని కోరారు.

**కమిటీ ఛైర్మన్, సభ్యుల హామీ**

కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్మికులు కోరిన ఈ సంక్షేమ ఫలాలు ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని, నాడు రక్తం, చెమట చిందించి సాధించుకున్న వారి హక్కు అని ఉద్ఘాటించారు. ఈ డిజిటల్ రికార్డింగ్ ప్రక్రియ ఆధారంగా ప్రతి ఒక్క నిజమైన కార్మిక ఉద్యమకారుడి పేరును రికార్డుల్లో ఎక్కించి తీరుతామని భరోసా ఇచ్చారు. ఈ వినతులన్నింటినీ క్రోడీకరించి ఒక పటిష్టమైన, సమగ్రమైన నివేదికను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి సమర్పించి అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని కమిటీ ఛైర్మన్ కేశవరావు హామీ ఇచ్చారు.



# తయారీ రంగానికి అత్యంత అనుకూలం

**మొదటిపేజీ తరువాయి**

ప్రపంచస్థాయి మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బవేరియన్(జర్మనీ) మినిస్ట్రీ ఆఫ్ ఎకానమిక్ అఫైర్స్, రీజినల్ డెవలప్‌మెంట్ అండ్ ఎనర్జీ వైస్ మినిస్టర్ టోబియాస్ గోత్‌హార్ట్ నేతృత్వంలోని జర్మనీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ భేటీలో తెలంగాణ-జర్మనీ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు గల అవకాశాలపై చర్చించారు. పారిశ్రామికాభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, పరిశ్రమలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలను మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, ఏరో స్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రెసిషన్ ఇంజినీరింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, సెమీకండక్టర్లు, ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ, ఏఐ, డిజిటల్ హెల్త్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్, క్లీన్ ఎనర్జీ, జీసీసీలు, ఇండస్ట్రీ 4.0 తదితర రంగాల్లో తెలంగాణలో విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయన్నారు. అత్యాధునిక సాంకేతికత, పరిశోధన, ఇన్నోవేషన్, స్కిల్లింగ్‌కు ప్రాధాన్యమిస్తూ ఈ రంగాల్లో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా సమగ్ర ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. తెలంగాణ-జర్మనీ మధ్య భాగస్వామ్యాన్ని పెట్టుబడులకు మాత్రమే పరిమితం కాకుండా సాంకేతికత, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాలకూ విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, హైదరాబాద్‌లో జర్మనీ గౌరవ కాన్సుల్ అమితా దేశాయ్, బవేరియా ఆర్థిక శాఖ ఈడీ ఉల్రికే హాఫ్‌మన్, బవేరియా ఇండియా కార్యాలయ ఈడీ జాన్ కొట్టాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ పేరిట బెదిరింపులు

**హైదరాబాద్, జూలై 10**

"మీపై అవినీతి కేసు నమోదు కాకుండా ఉండాలంటే వెంటనే రూ.లక్ష పంపాలి" అంటూ ఏసీబీ అధికారుల పేరుతో ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు ఓ రెవెన్యూ అధికారిని బురిడీ కొట్టించి రూ.లక్ష కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. చేర్యాల తహశీల్దార్ ఇటీవల ఏసీబీకి చిక్కిన ఘటనను ఆసరాగా చేసుకుని ఈ మోసానికి పాల్పడినట్లు తెలుస్తోంది. చేర్యాల తహశీల్దార్ ఏసీబీకి చిక్కిన తర్వాత అక్కడి రెవెన్యూ అధికారుల్లో నెలకొన్న ఆందోళనను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. మీపై కూడా అవినీతి ఆరోపణలు ఉన్నాయని, కేసు నమోదు కాకుండా ఉండాలంటే వెంటనే డబ్బులు చెల్లించాలని పలువురు రెవెన్యూ అధికారులకు ఫోన్ కాల్స్ చేసి బెదిరించడం ప్రారంభించారు. ఈ క్రమంలో చేర్యాల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు, ఏసీబీ అధికారులు మాట్లాడుతున్నామని నమ్మించి, కేసు నుంచి తప్పించుకోవాలంటే వెంటనే రూ.లక్ష తమ ఖాతాకు బదిలీ చేయాలని ఒత్తిడి తెచ్చారు. అకస్మాత్తుగా వచ్చిన ఈ కాల్‌తో తీవ్ర ఆందోళనకు గురైన అధికారి వారు సూచించిన బ్యాంకు ఖాతాకు రూ.లక్ష బదిలీ చేశారు. డబ్బులు పంపిన కొద్దిసేపటి తర్వాత అనుమానం వచ్చిన అధికారి తిరిగి అదే నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌గా రావడంతో మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డబ్బు బదిలీ అయిన ఖాతా, ఫోన్ నంబర్ల వివరాలను సేకరించి నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.
ఈ ఘటన నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు సహా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. దర్యాప్తు సంస్థలు, ప్రభుత్వ శాఖల పేరుతో ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసినా నమ్మవద్దని, ఎలాంటి ఒత్తిడికీ లోనై నగదు బదిలీ చేయవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద కాల్స్ వచ్చిన వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# అత్తాపూర్‌లో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

**హైదరాబాద్, జూలై 10**

"హైదరాబాద్‌లో గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాపై దాడులు నిర్వహించి ఎండీఎంఏ డ్రగ్స్, భారీ మొత్తంలో మెఫెంటెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నాం. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నాం" అని పోలీసులు తెలిపారు.
రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అత్తాపూర్‌లోని జలాల్‌బాబా నగర్‌లో నిర్వహించిన మెరుపు దాడుల్లో 8 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌తో పాటు భారీ సంఖ్యలో మెఫెంటెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అబ్దుల్ హసన్‌తో పాటు ముజాహిద్‌ను అదుపులోకి తీసుకుని అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు.
డ్రగ్స్ విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారంతో అబ్దుల్ హసన్ నివాసంపై దాడులు నిర్వహించగా ఇంట్లో దాచి ఉంచిన ఎండీఎంఏ డ్రగ్స్, ఇంజెక్షన్లు బయటపడ్డాయి. ప్రాథమిక విచారణలో బెంగళూరు నుంచి ఎండీఎంఏ డ్రగ్స్‌ను తెప్పించి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అలాగే గుజరాత్ నుంచి మెఫెంటెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు తెప్పించి ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా నగరంలో విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.
శరీర దారుఢ్యం పెంచుకోవాలనే ఉద్దేశంతో కొందరు యువకులు ఈ ఇంజెక్షన్లను వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వైద్యుల సూచన లేకుండా ఇటువంటి ఇంజెక్షన్ల విక్రయం చట్టవిరుద్ధమని, ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రధాన నిందితుడు అబ్దుల్ హసన్‌పై హైదరాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే దారి దోపిడీ, హత్య, రౌడీషీటర్ కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. ఇటీవల పాతబస్తీలో జరిగిన హత్య కేసులో కూడా అతడు ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఎండీఎంఏ డ్రగ్స్, భారీ సంఖ్యలో ఇంజెక్షన్లతో పాటు పలు ప్రాణాంతక ఆయుధాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన అత్తాపూర్ పోలీసులు డ్రగ్స్ నెట్‌వర్క్‌లో మరెవరి ప్రమేయం ఉందనే కోణంలో, సరఫరా వ్యవస్థపై సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కాళేశ్వరం విషయంలో రైతుల ప్రయోజనాలే ప్రధానం: ఈటల రాజేందర్

**మొదటిపేజీ తరువాయి**

శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుడిగా రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తాను ఎలాంటి రాజీ పడబోనని స్పష్టం చేశారు. ప్రజలకు నష్టం జరుగుతుంటే మౌనంగా ఉండే ప్రసక్తే లేదని, రైతుల సంక్షేమమే తనకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.
కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలకు బదులుగా నిపుణులైన ఇంజినీర్ల సలహాలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. మేడిగడ్డలో నీటిని నిల్వ చేయకుండానే దిగువకు వెళ్తున్న నీటిని ఎత్తిపోయే అవకాశం ఉందని తెలిపారు.
రాష్ట్రంలో తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వ్యవహరించాలని ఈటల కోరారు. హైదరాబాద్‌కు ఇప్పటికే తాగునీటి కొరత ఉందని, భవిష్యత్తులో పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు సాగునీరు అందకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు.
కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని పూర్తిగా వెలికితీయాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని అక్రమంగా ఖర్చైన ప్రజాధనాన్ని తిరిగి రాబట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే అవినీతి విచారణ పేరుతో రైతులకు, ప్రజలకు అవసరమైన నీటి సరఫరాను నిలిపివేయడం సరికాదన్నారు. తెలంగాణ ప్రయోజనాలే తనకు మొదటి ప్రాధాన్యమని, రైతుల కోసం అవసరమైతే ఎంత దూరమైనా పోరాటం కొనసాగిస్తానని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

# కాచుకో కేసీఆర్..

**మొదటిపేజీ తరువాయి**

దేశంలో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశాలను ప్రస్తావించిన రేవంత్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ బిల్లును తీసుకురావచ్చని అన్నారు. ఆ ప్రక్రియ పూర్తయితే తెలంగాణలో లోక్‌సభ స్థానాలు 26కు, అసెంబ్లీ స్థానాలు 182కు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 117 స్థానాలను గెలుచుకుని మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ 65 స్థానాలు గెలుస్తుందని తాను ప్రకటించగా, పార్టీ 64 స్థానాలు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అదే విశ్వాసంతో ఇప్పుడు కూడా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఖమ్మం గడ్డపై నుంచి ప్రకటిస్తున్నానని తెలిపారు.



ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై కూడా విమర్శలు చేసిన ముఖ్యమంత్రి, దేశంలోని ప్రాంతీయ పార్టీలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీసే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా నిర్వహించిన ఈ సభలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా 2029 ఎన్నికలు, అసెంబ్లీ స్థానాల పెంపు, కాంగ్రెస్ విజయంపై చేసిన వ్యాఖ్యలు, కేసీఆర్‌కు విసిరిన సవాల్ తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి

# రైతు భరోసా కింద మరో రూ.1,009 కోట్ల విడుదల

**హైదరాబాద్, జూలై 10**



తెలంగాణలో రైతులకు పెట్టుబడి సాయం అందించే కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద మరో రూ.1,009 కోట్లను విడుదల చేసింది. ఈ మొత్తాన్ని అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారు. తాజా విడుదలతో కలిపి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రైతు భరోసా పథకం ద్వారా విడుదల చేసిన మొత్తం నిధులు రూ.8,759 కోట్లకు చేరాయి. రాష్ట్రవ్యాప్తంగా సాగు చేస్తున్న రైతులకు ఆర్థికంగా అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం విడతల వారీగా పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. రైతులు సాగు ప్రారంభ దశలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన పెట్టుబడిని అందించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 74 లక్షల మంది రైతులు రైతు భరోసా పథకం ద్వారా లబ్ధి పొందారు. 1.45 కోట్ల ఎకరాల సాగు భూములకు గాను మొత్తం రూ.7,750 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, రైతులకు సాగు సమయంలో పెట్టుబడి కొరత లేకుండా చూడడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ భవిష్యత్తులో కూడా రైతు భరోసా పథకం అమలు కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# మత్స్యకారుల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**కోహెడ, జూలై 10 :**

మత్స్యకారుల సమగ్ర అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్లతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యధిక జనాభా ఉన్న మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని, మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్య కారులకు శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజుల సంక్షేమం కోసం పాటుపడతానని, ముదిరాజుల అభివృద్ధి కోసం మంత్రి, ఎమ్మెల్యే పదవికే కాదు.. ప్రాణం ఇవ్వడానికైనా సిద్ధం అని శ్రీహరి అన్నారు. తెలంగాణ మత్స్య రంగ చరిత్రలో మరో చారిత్రక ఘట్టంగా నిలిచే కోహెడలో అంతర్జాతీయ మంచినీటి చేపల ఎగుమతుల కేంద్రం శంకుస్థాపనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, సముద్రతీర ప్రాంతం కాకుండా దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ఇలాంటి ఆధునిక ఎగుమతుల కేంద్రం ఏర్పాటు కావడం తెలంగాణకు గర్వకారణమని చెప్పారు. మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడం, వారికి శాశ్వత ఉపాధి కల్పించడం, అంతర్జాతీయ మార్కెట్లకు అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టిందన్నారు.

**మంచినీటి చేపల ఉత్పత్తిలో అగ్రస్థానం**

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో సుమారు రూ.47 కోట్లతో ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ ప్రస్తుతం మంచినీటి చేపల ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. 2025లో రాష్ట్రంలో సుమారు 4.20 లక్షల టన్నుల చేపలు, 15 వేల టన్నుల మంచినీటి రొయ్యల ఉత్పత్తి నమోదైంది. ఈ ఎగుమతుల కేంద్రం అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోని చేపలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లు లభించి మత్స్యకారులకు మెరుగైన ధరలు అందనున్నాయి. తెలంగాణ చేపలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు దక్కనుంది. ఈ కేంద్రంలో ఆధునిక శీతల గిడ్డంగులు, శుద్ధి యూనిట్లు, ప్యాకేజింగ్ కేంద్రాలు, శిక్షణ కేంద్రం, కస్టమ్స్ సదుపాయాలు, భారీ హోల్‌సేల్ మార్కెట్ వంటి అన్ని ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నారు. సుమారు రెండు వేల మంది వ్యాపారులు ఇక్కడ వ్యాపారం నిర్వహించే అవకాశం ఉండగా లోడింగ్, అన్‌లోడింగ్, ప్యాకేజింగ్, రవాణా తదితర రంగాల్లో సుమారు ఐదు వేలమందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇది చేపల మార్కెట్ మాత్రమే కాక రాష్ట్ర మత్స్య రంగాన్ని ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానం చేసే అభివృద్ధి వేదికగా నిలవనుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించనుంది. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే ప్రతి చేపకు ప్రపంచ మార్కెట్ అందించడమే తమ లక్ష్యం.. మత్స్యకారుల కుటుంబాల్లో ఆర్థిక సంతోషం నింపడమే ప్రభుత్వ సంకల్పం' అని ప్రభుత్వం పేర్కొంది. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఫ్రూట్ మార్కెట్ ఛైర్మన్ చిలుక మధు, రంగారెడ్డి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్, ఫిషరీస్ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, మత్స్యకారులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో బండి భగీరథ్‌కు షరతులతో బెయిల్

- చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి విడుదల
- దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం
- సాక్షులను ప్రభావితం చేయొద్దని స్పష్టీకరణ

**హైదరాబాద్, జూలై 10**

"పోక్సో చట్టం కింద నమోదైన కేసులో బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నాం. దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలి. అవసరమైనప్పుడు విచారణ అధికారుల ఎదుట హాజరుకావాలి. సాక్షులు, ఫిర్యాదుదారులను ఎలాంటి ప్రభావానికి గురిచేయరాదు" అని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు శుక్రవారం బండి భగీరథ్ చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి విడుదలయ్యారు. బెయిల్ ఉత్తర్వుల ప్రతులు జైలు అధికారులకు అందిన అనంతరం అవసరమైన న్యాయపరమైన ప్రక్రియలను పూర్తి చేసి ఆయనను విడుదల చేశారు.భగీరథ్ విడుదల సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులు, సన్నిహితులు చర్లపల్లి కేంద్ర కారాగారం వద్దకు చేరుకుని ఆయనకు స్వాగతం పలికారు. విడుదల అనంతరం వారు కొద్దిసేపు భగీరథ్‌తో మాట్లాడారు. బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు పలు షరతులు విధించింది. కేసు దర్యాప్తులో విచారణ అధికారులకు పూర్తిగా సహకరించాలని, అవసరమైనప్పుడు వారి ఎదుట తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించింది. అలాగే కేసులోని సాక్షులు, ఫిర్యాదుదారులను ఎలాంటి ప్రభావానికి గురిచేయరాదని స్పష్టం చేసింది. కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో హైకోర్టు విధించిన అన్ని షరతులను తప్పనిసరిగా పాటించాలని న్యాయస్థానం పేర్కొంది. షరతుల ఉల్లంఘన జరిగితే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. కేసు తదుపరి విచారణ సంబంధిత న్యాయస్థానంలో కొనసాగనుంది.



# ఓఆర్ఆర్‌పై ఏఐతో ప్రమాదాల నియంత్రణకు చర్యలు

**హైదరాబాద్, జూలై 10**

"ఔటర్ రింగ్ రోడ్డుపై రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజలకు మరింత సురక్షితమైన ప్రయాణ వాతావరణం కల్పించేందుకు అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నాం. కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థతో ట్రాఫిక్ ఉల్లంఘనలను సమర్థంగా గుర్తించి ప్రమాదాలను నియంత్రిస్తాం" అని పోలీసు కమిషనర్ సజ్జనార్ తెలిపారు.

తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో హెచ్ఎండీఏ, ఎన్‌హెచ్ఏఐ, జీహెచ్ఎంసీ, హెచ్‌జీసీఎల్, ఐఆర్బీ ఇన్‌ఫ్రా ప్రతినిధులతో పాటు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత మే నెలలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని అధికారులు వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే 80 కీలక ప్రాంతాలను గుర్తించినట్లు సమావేశంలో వెల్లడించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పర్యవేక్షణ, నిబంధనల అమలును కట్టుదిట్టం చేశామని, మిగిలిన ప్రాంతాల్లో కూడా దశలవారీగా భద్రతా చర్యలను విస్తరిస్తామని అధికారులు తెలిపారు. ప్రమాదాలను సమర్థవంతంగా అరికట్టేందుకు కృత్రిమ మేధస్సు ఆధారిత ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థ అమలుపై సమావేశంలో చర్చించారు. ఈ వ్యవస్థ ద్వారా అతివేగం, లేన్ ఉల్లంఘనలు, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు. ఏఐ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థ అమల్లోకి వస్తే ట్రాఫిక్ నిబంధనలను పదేపదే ఉల్లంఘించే వారిపై మరింత సమర్థంగా చర్యలు తీసుకోవచ్చని సజ్జనార్ తెలిపారు. సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఔటర్ రింగ్ రోడ్డుపై భద్రతను మరింత బలోపేతం చేయాలని ఆయన ఆదేశించారు. రహదారి భద్రతపై నిరంతర సమీక్ష కొనసాగిస్తూ ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను వేగంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.



# పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి

- పరిశ్రమల శాఖ అధికారులకు సీఎస్ సంజయ్ ఆదేశాలు

**హైదరాబాద్, జూలై 10:**

రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ప్రాధాన్య పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో చేపడుతున్న కీలక పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై పరిశ్రమలు, వాణిజ్య శాఖ సీనియర్ అధికారులతో సచివాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణంగా పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయాలని, తద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికి, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించడానికి వీలు కలుగుతుందని అన్నారు. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ద్వారా భారత్ ఫ్యూచర్ సిటీ, జహీరాబాద్ ఇండస్ట్రియల్ సిటీ, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతోపాటు ఇతర వ్యూహాత్మక పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ శశాంక ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి, అభివృద్ధి చేస్తున్న మౌలిక సదుపాయాలు, పెట్టుబడి అవకాశాలు, పూర్తి చేయాల్సిన గడువులపై సీఎస్‌కు వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా అధికారులు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సీఎస్ ఆదేశించారు. అలాగే కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే అవరోధాలను ముందుగానే గుర్తించి, శాఖల మధ్య సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమావేశంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చేనేత, వస్త్ర శాఖ ప్రత్యేక కార్యదర్శి కాత్యాయనీదేవి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో అజిత్ రెడ్డి, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రతిభ, పరిశ్రమలకు అనుకూల వాతావరణం

**మొదటిపేజీ తరువాయి**

శుక్రవారం ప్రారంభించారు. కొండాపూర్‌లోని క్రిషే ఎమరాల్డ్ భవనంలో ఏర్పాటు చేసిన ఈ నూతన కేంద్రం అడ్వాన్స్‌డ్ సెమీకండక్టర్ డిజైన్, హైస్పీడ్ కనెక్టివిటీ, నెక్స్ట్ జనరేషన్ ఏఐ సిస్టమ్ డెవలప్‌మెంట్‌కు కీలక ఇంజనీరింగ్ హబ్‌గా సేవలందించనుంది. కార్యక్రమంలో కందూ ఏఐ సీఈఓ, కోఫౌండర్ సృజన్ లింగతో పాటు సంస్థ ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, ఉద్యోగులు, భాగస్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రపంచ స్థాయి సెమీకండక్టర్, డీప్‌టెక్, ఏఐ రంగాలకు విశ్వసనీయ గమ్యస్థానంగా ఎదగడం తెలంగాణ ప్రభుత్వం అనుసరించిన దూరదృష్టి విధానాల ఫలితమని అన్నారు. ప్రతిభ, పరిశ్రమలకు అనుకూల వాతావరణం, అత్యుత్తమ మౌలిక సదుపాయాల కారణంగానే ప్రపంచ దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌ను తమ విస్తరణకు ఎంచుకుంటున్నాయని పేర్కొన్నారు కందూ ఏఐ తన ఇండియా చిప్ డిజైన్ హెడ్‌క్వార్టర్స్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం నగర ప్రతిష్ఠను మరింత పెంచుతుందన్నారు. ఈ సంస్థ ద్వారా అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలు, ఉన్నత స్థాయి ఉపాధి అవకాశాలు, సెమీకండక్టర్ పరిశ్రమలో మరిన్ని పెట్టుబడులు తెలంగాణకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కందూ ఏఐ సీఈఓ, కోఫౌండర్ సృజన్ లింగ మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ ఇంజనీరింగ్ ప్రతిభకు హైదరాబాద్ అత్యుత్తమ కేంద్రంగా నిలిచిందని పేర్కొన్నారు. సంస్థ దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగానే ఇండియా చిప్ డిజైన్ హెడ్‌క్వార్టర్స్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో స్థానిక ప్రతిభను మరింత ప్రోత్సహిస్తూ



విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ కేంద్రంలో చిప్ డిజైన్, వెరిఫికేషన్, వాలిడేషన్, ఫర్మ్‌వేర్, సాఫ్ట్‌వేర్, సిస్టమ్స్ ఇంజనీరింగ్, కస్టమర్ సపోర్ట్ వంటి కీలక విభాగాలు పనిచేయనున్నాయి. దీంతో కందూ ఏఐ గ్లోబల్ ఇంజనీరింగ్ నెట్‌వర్క్ మరింత బలోపేతం కావడంతోపాటు హైదరాబాద్ అంతర్జాతీయ సెమీకండక్టర్ హబ్‌గా తన స్థానాన్ని మరింత బలపరుచుకోనుంది.

# పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందా?

**హైదరాబాద్, జూలై 10!:**

భద్రాద్రి శ్రీరాముడి సాక్షిగా సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చేసిన ప్రమాణం ఏమైంది? రాష్ట్రం సంగతి పక్కన పెడదాం... కనీసం నువ్వు సభ పెట్టిన ఖమ్మం జిల్లాలో అయినా రైతులందరికీ పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందా? సమాధానం చెప్పగలవా? ఒకవైపు "చివరి ఏడాదిలో రాజకీయాలు చేద్దాం" అంటూ.. మరోవైపు ప్రతి బహిరంగ సభలో ఎందుకంత ఆవేశంతో, అసహనంతో రగిలిపోతున్నావంటూ రేవంత్‌రెడ్డిని హరీష్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కన్నెపల్లి నుండి నీళ్ళు లిఫ్ట్ చేయని నీ చేతగానితనాన్ని అబద్ధాలతో కవర్ చేసుకోవాలని చూడటం హీనమైన చర్య.28 లక్షల వరద వచ్చినప్పుడే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు చెక్కు చెదరలేదు. లక్ష క్యూసెక్కుల వరద వస్తున్న ప్రస్తుత సమయంలో ఏదో జరుగుతుందని ఎందుకు భ్రమలు కల్పిస్తున్నారు.కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీళ్లను లిఫ్ట్ చేసి అన్నారం, సుందిళ్ల ద్వారా ఎల్లంపల్లికి తరలించాలని చెబుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు?రిటైర్డ్ ఇంజనీర్ల సుదీర్ఘ అనుభవం అంటే మీకు లెక్కే లేదా?ఆనాటి రోజులు తెస్తానన్న రేవంత్ రెడ్డి.. మళ్లీ సమైక్య రాష్ట్రం నాటి తెలంగాణ జలాల దోపిడీకి తలుపులు తెరిచిన పరిస్థితి తీసుకురావడం దుర్మార్గం.తెలంగాణ జలాలను తన గురువు చంద్రబాబుకు కప్పం కడుతున్నట్లుగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయి.నీళ్లు ఉండి కూడా ఎత్తిపోకుండా, రిజర్వాయర్లు నింపకుండా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి తెలంగాణకు శాపంగా, ఆంధ్రప్రదేశ్‌కు వరంగా మారింది. ఒక వైపు ఎల్ నినో ప్రభావం ఉన్నా తెలంగాణలో గోదావరి జలాలు గలగలా ప్రవహిస్తున్నాయి. అయినా ఆ నీటిని ఒడిసిపట్టకుండా ఆంధ్రప్రదేశ్‌కు వదిలిపెడుతున్న రేవంత్ సర్కారు తెలంగాణకు జలద్రోహం చేస్తోంది.ఎల్‌నినో కరువు హెచ్చరికలు, రిటైర్డ్ ఇంజనీర్ల సూచనలు పక్కనబెట్టి నీటిని ఎత్తిపోసే చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట.కన్నెపల్లి పంప్ హౌజ్ వద్ద లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉన్నా పంపులు ఆన్ చేయకుండా నీటిని దిగువకు వదిలేయడం తెలంగాణ రైతాంగానికి రేవంత్ చేస్తున్న నమ్మక ద్రోహం. ఇది రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ అసలు వైఖరికి నిదర్శనం.రోజుకు 3 టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం ఉన్న పంపులు సిద్ధంగా ఉన్నా కావాలనే ఆన్ చేయకపోవడం క్షమించరాని నిర్లక్ష్యం.నీళ్లు ఉండి కూడా వాడుకోకపోవడం కంటే పెద్ద వైఫల్యం ఇంకేముంటుంది?తెలంగాణ ప్రభుత్వం నీటిని వదిలేస్తుంటే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ, తాడిపూడి, పురుషోత్తమపట్నం, పుష్కర ఎత్తిపోతల ద్వారా రోజుకు 3 టీఎంసీల చొప్పున ఇప్పటికే 60 టీఎంసీలకు పైగా నీటిని వినియోగించుకుంది.తెలంగాణ ప్రభుత్వం మాత్రం చేతులెత్తేసి చోద్యం చూస్తున్నది.నిరంతరాయంగా పట్టిసీమ పంపులు పనిచేస్తూ మొత్తం 24 మోటార్లను ఫుల్ రన్‌లో ఉంచి గోదావరి జలాలను ఏపీ కృష్ణా డెల్టాకు తరలిస్తుంటే, మరోవైపు తెలంగాణ ప్రభుత్వం మాత్రం పంపులు ఆన్ చేయకుండా చేతులు ముడుచుకుని కూర్చోవడం సిగ్గుచేటు.ఒక్కో పట్టిసీమ మోటారు 4 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తూ నీటిని ఎత్తిపోస్తుంటే, తెలంగాణలో సిద్ధంగా ఉన్న బాహుబలి పంపులను నడపకపోవడం వెనుక దాగి ఉన్న చీకటి ఒప్పందం ఏమిటి?కళ్ల ముందే నీరు ఏపీకి తరలివెళ్తున్నా తెలంగాణ ప్రభుత్వం ఎందుకు చేతులు ముడుచుకుని కూర్చొంటున్నది?తెలంగాణ రైతులకు ఉపయోగపడాల్సిన నీళ్లు ఏపీకి తరలిపోతుంటే సీఎం, నీళ్ల మంత్రి ఎందుకు చేష్టలుడిగి చూస్తున్నట్లు?గురుదక్షిణ చెల్లింపులో భాగంగానే కన్నెపల్లి పంపులను ఆన్ చేయకుండా తెలంగాణ జలాలను ఏపీకి వదులుతున్నారా? దీనిపై ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలి?ఎల్లంపల్లి ప్రాజెక్టులో 20.18 టీఎంసీల సామర్థ్యానికి కేవలం 5.48 టీఎంసీలే నిల్వ ఉంది. డెడ్ స్టోరేజీ 3.32 టీఎంసీల స్థాయికి చేరువలో ఉన్నా ప్రభుత్వం అప్రమత్తం కావడం లేదు. ఇది బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట. ఎల్లంపల్లి స్టేజ్ 1 & 2 ఆయకట్టుకు 12 టీఎంసీ, కడెం లిఫ్ట్ స్కీమ్ కోసం 3 టీఎంసీ, మంథని, రామగుండం సాగునీటి అవసరాల కోసం 2టీఎంసీ, రామగుండం ఎన్‌టీటీపీ కోసం 6.50 టీఎంసీ, ఎన్‌టీపీసీ కోసం 4.73 టీఎంసీ మొత్తంగా విద్యుత్ ఉత్పత్తి, పరిశ్రమల అవసరం కోసం 13.67 టీఎంసీ, తాగునీటి సరఫరా, మిషన్ భగీరథ కోసం 6.57 టీఎంసీ, హైదరాబాద్ తాగునీటి సరఫరా కోసం 10 టీఎంసీ కేటాయింపులు ఉన్నాయి.

డెడ్ స్టోరేజీకి చేరిన నీటి నిల్వతో ఈ అవసరాలను ప్రభుత్వం ఎలా తీర్చుతుంది? హైదరాబాద్‌కు తాగునీటి సమస్య ఏర్పడితే దానికి బాధ్యులు ఎవరు? ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు ఏం చేస్తున్నట్లు? ప్రమాద ఘంటికలు మోగుతున్నా ముందస్తు చర్యలు తీసుకోకపోవడం తీవ్రమైన నిర్లక్ష్యం. ప్రజల అవసరాలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని హరీష్‌రావు ప్రశ్నించారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఎగువ గోదావరిలో కొద్దిపాటి వరదలు కూడా రాలేదు. ఎస్సారెస్పీ ఎగువ, దిగువ ప్రాంతాల్లో కూడా ప్రవాహాలు ఆశించిన స్థాయిలో లేవు. ఎగువ గోదావరిలో ఇలాంటి లోటు ప్రవాహాలు ఉన్న కరువు కాలంలో దిగువ గోదావరిలో లక్ష క్యూసెక్కుల నీరు వృథా గా కిందకు వెళ్ళిపోతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో దిగువ గోదావరిలో లభ్యమవుతున్న నీటిని ఒడిసి పట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత. గోదావరిలో వరద లేదని, వానలు లేవని ప్రభుత్వం చెబుతోంది. మరి పట్టిసీమలో 24 మోటార్లు నిరంతరాయంగా ఎలా నడుస్తున్నాయి? గోదావరిలో వరద లేకపోతే పట్టిసీమకు నీరు ఎక్కడి నుంచి వస్తోంది రేవంత్ రెడ్డి?మేడిగడ్డ వద్ద ప్రాణహిత నుంచి ప్రవాహం కొనసాగుతోంది. బరాజ్ వద్ద నీటి మట్టం పంపింగ్‌కు అనుకూలంగా ఉన్నా ప్రభుత్వం మాత్రం ఉద్దేశపూర్వకంగా పంపులు ఆన్ చేయడం లేదు. ఇది తెలంగాణ రైతులపై కక్షసాధింపు కాదా?93.5 మీటర్ల వద్ద నుంచే నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో కాళేశ్వరాన్ని పక్కనబెట్టి రైతుల భవిష్యత్తుతో ఆటలాడుతోంది. రాజకీయ ద్వేషం కోసం రైతులను బలిపశువులను చేయడం దారుణం.దేవాదుల ప్రాజెక్టులో పది మోటార్లు ఉన్నా రేవంత్ సర్కారు తూతూమంత్రంగా ఒకటి, రెండు పంపులు మాత్రమే నడిపిస్తోంది.సగానికి పైగా మోటార్లను ఆన్ చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం.



# పీకే ఓసీ2 డీప్ సైడ్ సింగరేణికే కేటాయించాలి

**మణుగూరు, జూలై 10**

మణుగూరు పీకే ఓసీ2 డీప్ సైడ్ విస్తరణను ఎలాంటి షరతులు లేకుండా సింగరేణికే కేటాయించాలని హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త "బాయి బాట" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మణుగూరులో నిర్వహించిన పిట్ మీటింగ్లో ఆమె మాట్లాడారు. పీకే ఓసీ2 డీప్ సైడ్ సింగరేణికి రాకపోతే మరో మూడేళ్లలో మణుగూరు ప్రాంత భవిష్యత్తు సంక్షోభంలో పడుతుందని, వేలాది మంది కార్మికులు, స్థానిక ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.54 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చే యాలని డిమాండ్ చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు కార్మికుల హక్కని పేర్కొన్న కవిత నెలలో రెండుసార్లు మెడికల్ బోర్డులు నిర్వహించి అర్హులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ నెల 20 లోపు సింగరేణి యాజమాన్యం స్పందించకపోతే రామగుండం ఏరియాలో నిరసన దీక్ష చేపడతామని హెచ్చరిం చారు. బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని సింగరేణి సంస్థకే కేటాయించాలని పేర్కొన్నారు. సంస్థ పరిరక్షణ కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు.

# కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

- హరీష్ రావు అసమర్ధుడని ఆనాడే గుర్తించిన కెసిఆర్
- హుజూర్ నగర్ లో మోడల్ కాలనీకి మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన



**నల్లగొండ, జూలై 10:**

కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడానికి ప్రధాన కారణం కేవలం బీఆర్ఎస్ పార్టీయేనని మంత్రి ఉత్త మ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎక్కువ మొత్తం ఖర్చు పెడితే ఎక్కువ కమీషన్ వస్తుందనే దురాశతోనే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును తొలగించి కాళేశ్వరం అని పేరు మార్చారని ఆరోపించారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖ మంత్రిగా నువ్వు పనికిరావని మామే నిన్ను పదవి నుంచి తీసివేసి సర్టిఫికెట్ ఇచ్చాడు క దా అంటూ ఎద్దేవా చేశారు. రూ.38కోట్లతో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు చేపట్టి కనీసం పూర్తి చేయలేకపోయారని మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా హుజూర్నగర్లో రూ. 20 కోట్లతో నిర్మిస్తున్న మోడల్ కాలనీ అ వృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన బీఆర్ఎస్ నేతలపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్‌రావుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు కవిత ఆన్ రికార్డ్ చెప్పిన 1400 కోట్ల కమిషన్ వ్యవహారాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. కనీసం మట్టి పరీక్షలు కూడా నిర్వహించకుండా, అధికారులు సూచించిన చోట కాకుండా ఐదు కిలోటర్ల దూరంలో, ఇసుకపై పునాది వేయడం వల్లే ప్రాజెక్టు కూలిపోతుందని సేఫ్టీ కంట్రోల్ ముందే హెచ్చరించినా బీఆర్ఎస్ వినలేదని ఉత్తమ్ మండిపడ్డారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ టీమ్ హెచ్చరించినా పట్టించుకోకుండా.. ఇప్పుడు కాంగ్రెస్పై నిందలు వేయడం సరికా దన్నారు. డ్యామ్ సేఫ్టీ అధికారులు నీటిని నిల్వ చేయొద్దని చెబుతున్నా.. బీఆర్ఎస్ నేతలు ఇంకా మోసపూరిత మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేటకు వస్తున్న నీళ్లు ఎస్సారెస్పీ స్టేజ్ 2 ద్వారా వస్తున్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్కసారి కూడా కాళేశ్వరం నీళ్లు వదల్లేదని స్పష్టం చేశారు. తెలంగాణను అప్పులమయం చేసిన బీఆర్ఎస్ తప్పులను సరిదిద్దుతూ.. డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనల మేరకు ప్రాజెక్ట్ పనులను పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# గంజాయి, యువతి వివాదం.. యువకుడి దారుణ హత్య

- స్నేహితులే కిరాతకంగా కొట్టి చంపిన ఘటన
- పరారీలో నిందితుల కోసం పోలీసుల గాలింపు
- హయత్‌నగర్‌లో విషాదం

**హైదరాబాద్, జూలై 10**

గంజాయి లావాదేవీలు, ఓ యువతి విషయంలో తలెత్తిన వివాదం కారణంగా స్నేహితులే ఓ యువకుడిని కిరాతకంగా హత్య చేసిన ఘటన హయత్‌నగర్ మండలం పసుమాముల గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. పసుమాముల గ్రామానికి చెందిన నిషాని సుహాస్ (22) గంజాయికి బానిసయ్యాడు. వ్యసనానికి డబ్బులు సమకూర్చుకునేందుకు గంజాయి విక్రయాలకు కూడా పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో తన స్నేహితుడి ఫోన్ నుంచి ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువతికి అసభ్యకర సందేశాలు పంపడంతో వివాదం తలెత్తింది. ఆ యువతి నిందితుల్లో ఒకరి స్నేహితురాలు కావడంతో పాటు, గంజాయి విక్రయాలకు సంబంధించిన పాత ఆర్థిక లావాదేవీల వివాదం కూడా దీనికి తోడైంది. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున నిందితులు సుహాస్‌ను ఇంటి నుంచి బయటకు పిలిచి గ్రామ శివార్లలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ అతనిపై విచక్షణారహితంగా దాడి చేశారు. వారి నుంచి తప్పించుకునేందుకు సుహాస్ సుమారు అర కిలోమీటరు మేర పరుగెత్తినా, నిందితులు వెంబడించి పట్టుకుని మర్మావయవాలతో పాటు శరీరమంతా తీవ్రంగా కొట్టారు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే సుహాస్ మృతి చెందాడు. హత్య అనంతరం మృతదేహాన్ని పెద్ద అంబర్‌పేట్ -పసుమాముల రహదారిలోని శ్మశానవాటిక సమీపంలోని సిమెంట్ బెంచీపై పడేసి నిందితులు పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. తన కుమారుడిని చెడు అలవాట్ల నుంచి దూరం చేయాలనే ఉద్దేశంతో తల్లి నందిని సికింద్రాబాద్ నుంచి పసుమాములకు నివాసం మార్చినట్లు తెలిసింది. అయితే, కొద్ది రోజులకే ఈ దారుణ ఘటన చోటుచేసుకోవడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు.



# ఎత్తిపోతల పంచాయితీ!

## కాళేశ్వరం నీటి తరలింపుపై దాగుడు మూతలు

కాళేశ్వరంపై దాగుడు మూతలు కొనసాగుతున్నాయి. ఎవరిది నిజం అన్నది తేలడం లేదు. అధికార కాంగ్రెస్ కాళేశ్వరం పనికిరాదని, నీరు ఎత్తిపోయడానికి లేదని చెబుతోంది. చెరువులు కుంటలు నింపాలంటే ఎత్తిపోయాల్సిందే అని విపక్ష బిఆర్ఎస్ వాదిస్తోంది. సందట్లో సడేమియ్యాలా బిజెపి గోడవాటం వాదనలు చేస్తోంది. ఇందులో ఎవరు నిజం..ఎవరు అబద్ధం అన్నది తేలాల్సి ఉంది. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి పోయడంలో ఉన్న ఇబ్బందులు, కష్టనష్టాలను నిపుణుల కమిటీ తేల్చాల్సి ఉంది. ఎందుకంటే ఎల్‌నినో ప్రభావంతో వర్షాల జాడ లేకుండా పోయింది. జలాశయాలు వట్టిపోయాయి. ఎస్సారెస్పీ సహా గోదావరి బేసిన్‌లోని ప్రతి జలాశయం ఇప్పటికే డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయి. వానలు కురిసే అవకాశమూ తక్కువగానే ఉన్నది. ఎగువ నుంచి వరద వచ్చే ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈ క్రమంలో కన్నెపల్లిలో పంప్‌లను ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేస్తే తద్వారా ఎల్లంపల్లి సహా మధ్యమానేరు, దిగువ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మసాగర్, మల్కపేట తదితర రిజర్వాయర్లను నింపుకోవచ్చని బిఆర్ఎస్ వాదిస్తోంది. అదే విధంగా దేవాదుల నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకొనే అవకాశమున్నా రేవంత్ సర్కార్ నీటిని లిఫ్ట్ చేయడం లేదని కూడా హరీస్ రావు అన్నారు. కేవలం ఎన్డీఎస్ఏ నివేదికలను సాకుగా చూపుతూ ప్రాణహిత జలాలను ఒడిసిపట్టకుండా దిగువకు వదిలిపెడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.. కేవలం ఏపీలోని కృష్ణా డెల్టా కోసమే రేవంత్ సర్కార్ తెలంగాణ ప్రాజెక్టులను పడావు పెడుతున్నారని ఆరోపించారు కూడా. అయితే ఇందులో నిజమెంత అన్నది తేలాల్సి ఉంది. దీనిని ఎవరు తేల్చాలన్నది ప్రజలకు తెలియదు. ప్రస్తుతం సర్కార్ వ్యవహరిస్తున్న తీరు సైతం అందుకు బలాన్ని చేకూర్చుతున్నది. ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపింగ్ స్టేషన్ల నుంచి నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టి, తద్వారా పంటలు.. రైతుల ప్రయోజనాలను కాపాడాలని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం డిమాండ్ చేసింది. బరాజ్‌ల్లో మినిమమ్ డ్రా డౌన్ లెవల్ మేరకు జలాలను నిల్వ చేయవచ్చని, తద్వారా ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదని స్పష్టంచేసింది. అదీగాక ఎస్సారెస్పీ ఎగువన, దిగువన ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం వరకు వరదనే లేకుండా పోయింది. కానీ మేడిగడ్డ బరాజ్ వద్ద ప్రాణహిత నుంచి ప్రవాహం కొనసాగుతున్నది. మరోవైపు కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటర్ల ద్వారా రోజుకు 2 టీఎంసీలను ఎత్తిపోసుకొనే సామర్థ్యమున్నది. మరోవైపు ఏపీ ప్రభుత్వం ఎల్ నినో నేపథ్యంలో అప్పుడే ఎత్తిపోతలను ప్రారంభించింది. గోదావరిలో వస్తున్న వరదను ఉపయోగించుకుని కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నది. పోలవరం డ్యామ్ పూర్తయ్యే వరకు కుడికాలువ ద్వారా గోదావరి జలాలను తరలించేందుకుని ఏలూరు జిల్లాలో పట్టిసీమ లిఫ్ట్ స్కీమ్‌ను ఏపీ గతంలోనే చేపట్టింది. రోజుకు 8,500 క్యూసెక్కుల జలాలను గోదావరి నుంచి లిఫ్ట్ చేసి కుడికాలువ ద్వారా కృష్ణా డెల్టా ఆయకట్టుకు 80 టీఎంసీల మేరకు సాగునీటిని అందించడం ప్రధాన లక్ష్యం. అదేవిధంగా పోలవరం కుడికాలువకు సమాంతరంగా తాడిపూడి కెనాల్‌ను సైతం ఎపి నిర్మించింది. తాడిపూడి లిఫ్ట్ ద్వారా ఇక్కడా 1,400 క్యూసెక్కులను తరలించే ఏర్పాట్లు చేసింది. ఈ రెండు కాలువల ద్వారా గోదావరి జలాలను మళ్లిస్తున్నది. ప్రస్తుతం సూపర్ ఎల్ నినో నేపథ్యంలో పొరుగున ఏపీ ప్రభుత్వం పట్టిసీమ, తాడిపూడి లిఫ్ట్‌లను ప్రారంభించింది. సామర్థ్యం మేరకు గోదావరి జలాలను ఎత్తి పోసేందుకు సిద్ధమైంది.ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షాలు పడటం లేదని,మరోవైపు కేంద్ర జలసంఘం తాజా నివేదిక ప్రకారం రాష్ట్రంలోని పెద్ద ప్రాజెక్టులు, జలాశయాల్లో నీటి నిల్వలు సాధారణ స్థాయి కంటే సుమారు 16-46 శాతం తకువగా ఉన్నాయని వివరించారు. అదే సమయంలో రాష్ట్రంలో ప్రాణహిత నది మాత్రమే ఎల్లప్పుడూ ప్రవహించే నది. రాష్ట్రంలో నీరు లేని పరిస్థితిలోనూ ప్రాణహిత-గోదావరిలో వినియోగయోగ్య మైన వరద ప్రవాహాలు ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల ఈ మూడు లిఫ్టుల వ్యవస్థను సురక్షితంగా తిరిగి వినియోగించు కోవడం అత్యంత సమంజసమని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రాణహితలో వరద నీటిమట్టం మేడిగడ్డ ఎండీడీఎల్ కంటే ఎత్తుగా కొనసాగుతున్నంతకాలం, మేడిగడ్డ నుంచి కన్నెపల్లి పంప్‌స్టేషన్ నీటిని లిఫ్ట్ చేసి, అన్నారం, సుందిల్ల బరాజ్‌లను ఎండీడీఎల్ స్థాయిల వద్దే కొనసాగిస్తూ, నీటిని ఎల్లంపల్లి వరకు తరలించ వచ్చని, అది హైడ్రాలిక్‌పరంగా స్థిరమైన, నమ్మకమైన విధానమని విశ్రాంత ఇంజనీర్లు స్పష్టంచేశారు. గత వరద అనుభవాల ప్రకారం, సాంకేతిక నియమాలకు లోబడి, జాగ్రత్తతో, సురక్షిత పద్ధతుల్లో లిఫ్టులను నడిపితే గ్రామాల ముంపు, ఆస్తి నష్టం, ప్రాణనష్టం వంటి ప్రమాదాలు లేకుండానే నీటి పంపింగ్ వ్యవస్థను సఫలీకృతంగా వినియోగించుకోవచ్చని విశ్రాంత ఇంజినీర్లు చెబుతున్నారు. అంతిమంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో పంటలు, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా గోదావరిలో వచ్చే వరదనీటిని కాపాడుకోవాలి. అది ఎలా చేస్తారన్నది ఆలోచన చేయాలి. ప్రస్తుత దుర్భర పరిస్థితుల్లో సాగు,తాగునీటి అవసరాల కోసం అత్యసవర కార్యాచరణ సిద్ధం చేయాలి. అదికూడా యుద్ధప్రాతిపదిక సాగాలి. అప్పుడే మనకు నీటి కష్టాలు తీరుతాయి. పదేపదే విమర్శలతో కాలయాపన చేయడం కూడా మంచిది కాదు. ప్రజల, రైతుల ప్రయోజనం దృష్ట్యా కార్యరంగం లోకి దిగాల్సి ఉంది.

# నాలుగు దశాబ్దాల తర్వాత చారిత్రక అడుగు

- న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీకి ఘన స్వాగతం
- ఆక్లాండ్‌లో పర్యటన ప్రారంభం.. ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపు



**ఆక్లాండ్ (న్యూజిలాండ్), జూలై 10:** భారత విదేశాంగ చరిత్రలో మరో కీలక ఘట్టం నమోదైంది. ఆస్ట్రేలియా పర్యటనను విజయవంతంగా ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరానికి చేరుకున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత భారత ప్రధానమంత్రి అధికారికంగా న్యూజిలాండ్‌లో పర్యటించడం విశేషం. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ఆక్లాండ్ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని మోదీకి లక్సన్ స్వయంగా స్వాగతం పలికి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ పర్యటనలో ఇరు దేశాల ప్రధానులు ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సముద్ర భద్రత, విద్య, సాంకేతికత, పర్యాటకం, క్రీడలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. ఇటీవల కుదిరిన సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలుతో భారత్-న్యూజిలాండ్ సంబంధాలు మరింత బలోపేతం కావడంతో ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఆక్లాండ్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, క్రీడా రంగ ప్రముఖులతో ప్రధాని మోదీ సమావేశమవుతారు. అలాగే న్యూజిలాండ్‌లో నివసిస్తున్న ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రత్యేక కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న సాంస్కృతిక, సామాజిక బంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చిలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ భారతదేశాన్ని సందర్శించిన సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక సమావేశాలకు కొనసాగింపుగా తాజా పర్యటనను భావిస్తున్నారు. అంతకుముందు మూడు రోజులపాటు ఆస్ట్రేలియాలో పర్యటించిన ప్రధాని మోదీ, ఆ పర్యటన అత్యంత ఫలప్రదంగా సాగిందని పేర్కొన్నారు. న్యూజిలాండ్ పర్యటనతో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సుప్రీంకోర్టులో పిటిషనర్ వీరంగం

- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం
- భారత్‌కు ఎగుమతులపై 57 శాతం ఉత్పత్తులకు సుంకాల రద్దు
- 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని అధికారిక పర్యటన



**న్యూఢిల్లీ, జూలై 10 :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో శుక్రవారం తీవ్ర నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒక కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ హద్దులు మీరు ప్రవర్తించాడు. న్యాయ మూర్తులపై దూషణలకు దిగడమే కాకుండా, చేతిలోని కేసు పత్రాలను వారి వైపు విసిరికొట్టి తీవ్ర గందరగోళం సృష్టించాడు. తక్షణమే అప్రమత్తమైన భద్రతా అధికారులు అతడిని కోర్టు హాలు నుంచి బలవంతంగా బయటకు పంపించారు. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రబల్ ప్రతాప్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధేతో కూడిన ధర్మాసనం ఎదుట ఆయన స్వయంగా వాదనలు వినిపించాడు. అయితే, విచారణ ప్రారంభంలోనే పిటిషనర్ న్యాయమూర్తులను 'జ్యుడీషియల్ సర్వెంట్' అని సంబోధిస్తూ, 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను మిమ్మల్ని ఆదేశిస్తున్నాను' అని వ్యాఖ్యానించాడు. దీనిపై తీవ్ర విస్మయం వ్యక్తం చేసిన జస్టిస్ విశ్వనాథన్, "మమ్మల్ని ఆదేశిస్తున్నావా?" అని ప్రశ్నించారు. ఈ క్రమంలో ప్రబల్ ప్రతాప్ మరింత ఆవేశంతో ఊగిపోతూ, తన చేతిలోని పత్రాలను గాలిలోకి విసిరాడు. అదే సమయంలో, ఆ బెంచ్‌లో లేని ప్రధాన న్యాయమూర్తిపై కూడా దూషణలకు దిగాడు. దీంతో భద్రతా సిబ్బంది వెంటనే రంగప్రవేశం చేసి అతడిని కోర్టు హాలు నుంచి వెలుపలికి తరలించారు. ఒక సైబర్ క్రైమ్ సిండికేట్‌కు సంబంధించిన కేసులో, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 173(4) కింద తాను సమర్పించిన దరఖాస్తును ప్రైవేట్ కంప్లైంట్‌గా మార్చడాన్ని సవాల్ చేస్తూ ప్రబల్ ఈ పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు హాలులో చోటుచేసుకున్న ఈ అసాధారణ ఘటనకు సంబంధించిన వివరాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# అయోధ్య రామాలయ విరాళాల కేసుపై 13న సుప్రీంలో విచారణ



**న్యూఢిల్లీ:** అయోధ్య రామాలయంలో జరిగిన విరాళాల చోరీపై నమోదు అయిన పిటీషన్లపై జూలై 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రామాలయ నిధుల చోరీ కేసులో అరెస్టు అయిన 8 మందిని ఒక్క రోజు కస్టడీలోకి తీసుకోవాలని జూలై 7వ తేదీన అయోధ్య కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, కరుణేశ్ పాండేలను రిమాండ్‌లోకి తీసుకోవాలని కోర్టు సూచించింది. జూన్ 29వ తేదీన స్థానిక కోర్టు 8 మంది నిందితులను 14 రోజుల జుడిషియల్ కస్టడీకి ఆదేశించింది. అయితే ఈ అంశంపై దాఖలైన మూడు పిటీషన్లను సుప్రీంకోర్టు విచారించనున్నది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఆ పిటీషన్లను పరిశీలించనున్నది. అయోధ్య ఘటనలో సీబీఐ దర్యాప్తు చేపట్టాలని నరేంద్ర కుమార్ గోస్వామి అనే పిటీషనర్ సుప్రీంను ఆశ్రయించారు. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు చెందిన కాగ్ ఆడిట్ వివరాలను వెల్లడించాలని కోరారు. ఇదే కేసులో అజయ్ కుమార్ రాయ్, దినేశ్ కుమార్ యాదవ్ కూడా పిటీషన్లు వేశారు.

# భారత్‌కు తరలిస్తున్న 22 కేజీల కొకైన్ అమెరికాలో సీజ్



**న్యూఢిల్లీ:** భారత్‌కు విమాన మార్గంలో తరలిస్తున్న సుమారు 22 కేజీల కొకైన్(జశీఖఱఅవ ూవఞఓవ్య)ను అమెరికా పోలీసులు పట్టుకున్నారు. ఆ కొకైన్ విలువ సుమారు 1.5 మిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. మియామీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఉన్న ఎయిర్ కార్గో వేర్‌హౌజ్‌లో ఆ కొకైన్‌ను సీజ్ చేశారు. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారులు ఆ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఓ పార్సిల్‌లో ఉన్న స్పీకర్లు, ఆంప్లిఫయర్స్ కింద ఆ కొకైన్ దాచారు. మ్యూజిక్ ఎక్విప్మెంట్ అన్న మార్కింగ్‌తో పార్సిల్ చేశారు. ఆపరేషన్ స్ట్రయికర్ పేరుతో సీబీపీ ఆపరేషన్ చేపట్టారు. స్పీకర్లు, ఆంప్లిఫయర్లలో 8 ప్యాకెట్లు, నాలుగు బ్రిక్స్ రూపంలో వైట్ పౌడర్‌ను దాచిపెట్టినట్లు సీబీపీ అధికారులు తెలిపారు. ఆ పౌడర్‌ను కొకైన్ హైడ్రోక్లోరైడ్‌గా గుర్తిస్తూ అధికారులు నిర్ధారణ చేశారు. 22 కేజీలు ఉన్న ఆ కొకైన్ విలువ సుమారు 1.5 మిలియన్ల డాలర్లుగా ఉంటుందని కస్టమ్స్ అధికారులు చెప్పారు.

# ఇరాన్‌పై అమెరికా మిస్సైల్ దాడులు

## అణు కేంద్రం వద్ద పేలిన భవనం

**టెహ్రాన్, జూలై 10:** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జూన్‌లో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగియడంతో ఉద్రిక్తతలు మళ్లీ యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. గురువారం అమెరికా, ఇరాన్‌లు పరస్పరం దాడులు చేసుకున్నాయి. గురువారం తెల్లవారుజామున ఇరాన్‌లోని అణు విద్యుత్ కేంద్రం బుషెహర్ ప్లాంట్‌పై అమెరికా మిస్సైల్ దాడులు చేసింది. దీంతో అణు ప్లాంట్ ఆవరణలోని ఓ భవనం దెబ్బతింది. అమెరికా మిస్సైల్ దాడి చేసిన వెంటనే ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు వెంటనే స్పందించి ఎదురుదాడి చేశాయి. పరస్పర దాడుల కారణంగా ఆ ప్రాంతం మొత్తం పేలుళ్ల శబ్దాలతో హోరెత్తింది. ఇరాన్ అణు విద్యుత్ కేంద్రం ఉన్న 'బుషెహర్' ప్రాంతంతో పాటు చోగడక్, బందర్ అబ్బాస్, వ్యూహాత్మక ఓడరేవు ఉన్న కొనారక్ ప్రావిన్స్‌లలో భారీ పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. బుషెహర్ నగర శివార్లలోని మిలిటరీ ప్రధాన కార్యాలయంపై కూడా మిస్సైల్ దాడి జరిగింది. గడిచిన 48 గంటల్లో ఇరాన్ తీరప్రాంతాల్లోని దాదాపు 170కి పైగా సైనిక స్థావరాలపై అమెరికా సైన్యం దాడులు చేసింది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుంటున్న ఇరాన్‌ను దెబ్బతీసేందుకే ఈ చర్యలు ఈ దాడులు చేస్తున్నట్లు అమెరికా స్పష్టం చేసింది.



# ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- శనివారం ఆదివారం పూర్తిస్థాయిలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పాల్గొనాలి
- ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు అధికారులకు సెలవులు లేవు
- రిసోర్స్ పర్సన్ల సహకారం తీసుకోవాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ హెచ్చరించారు. శుక్రవారం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై తహసిల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో జూలై 20 లోపు డిజిటలైజేషన్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికీ 15 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు.

ప్రతి రోజు తప్పని సరిగా 15 శాతం డిజిటలైజేషన్ చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజు 100 మంది ఓటర్లను డిజిటలైజేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ముందస్తుగా టామ్ టామ్ ద్వారా, చెత్త సేకరించే వాహనాల ద్వారా సమాచారాన్ని అందించి ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. డిజిటలైజేషన్ తక్కువగా ఉన్న పోలింగ్ స్టేషన్లను జిల్లా అధికారులు సందర్శించి సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఐకెపి ఎపిఎం, ఫీల్డ్ అసిస్టెంట్లు, విఓఏ, రిసోర్స్ పర్సన్ ల సహకారం తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఏ ఒక్కరు ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని కలెక్టర్ తెలిపారు. శని, ఆదివారాల్లో పూర్తిస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు.13వ తేదీ ఉదయం లోపు 45 శాతం డిజిటలైజేషన్ పూర్తి కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు అధికారులు సెలవుల్లో వెళ్ళడానికి వీలు లేదని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైని) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డిఆర్ఓ స్వర్ణలత, జెడ్పి సీఈఓ సుధీర్, డిఆర్డిఓ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, మెప్మా పీడీ రవి కుమార్, డిఎంహెచ్ఓ సుధాకర్ లాల్, డిడబ్ల్యూఓ కాంతారావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నెమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## నేలకొండపల్లి సీఎం బహిరంగ సభకు భారీగా తరలిన ప్రజలు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లిలో జరిగిన సీఎం బహిరంగ సభకు నేలకొండపల్లి మండలం నుండి భారీ సంఖ్యలో ప్రజలు తరలి వెళ్లారు. సభకు వెళ్లేందుకు మండలం నుండి 118 బస్సులు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాన్ని నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ప్రారంభించారు.ఈ సభలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొడాలి గోవిందరావు, ఎంపీడీవో ఎర్రయ్య, ఏపీఎం సురేందర్, ఏపీఓ సునీత తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభకు తిరుమలాయపాలెం నుంచి జనసంద్రం..
# 148 బస్సుల్లో రైతులు, మహిళల భారీ తరలింపు!



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** చింతకాని మండలం జగన్నాధపురం లో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి పాల్గొననున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో తిరుమలయపాలెం మండలం నుంచి అపూర్వ స్పందన లభించింది. మండలంలోని 40 గ్రామ పంచాయతీల నుంచి 148 బస్సుల్లో డ్వాక్రా గ్రూపు సంఘాల మహిళలు, రైతులు మండల వివో ఏ ల ఆధ్వర్యంలో భారీగా సభకు బయలుదేరారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు పిండిప్రోలు కాకరవాయి సోలిపురం సుప్లేడు బీరోలు జూపెడ జల్లేపల్లి హైదర్ సాయి పేట పాతర్లపాడు తిరుమలాయపాలెం

### సీఎం సభ విజయవంతం

కోక్కిరేణి ఎర్రగడ్డ ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున సభకు తరలివెళ్లారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా నిర్వహిస్తున్న ఈ సభ విజయవంతం కానుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి సోలిపురం సర్పంచ్ నునావత్ సమ్మక్క అశోక్ కోప్పుల రామ్ రెడ్డి జూపెడ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి జడల నగేష్ గౌడ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దూదిమెట్ల వెంకట్ జాల కిరణ్ చామకూరి శ్రీనివాసరావు పప్పుల సుధాకర్ దొడ్డ గురవయ్య రావూరి యాకోబ్రావ్ పొట్ల కిరణ్ తాటికొండ కిరణ్ సర్పంచులు సంఘ బత్తుల స్వాతి సుమన్ రెడ్డి గుమ్మడి బిక్షం ధారావత సుజాత నల్లమల కీర్తి నిరన్ మార్ పుసలూరి సురేష్ జాల కిరణ్ గొల్ల లింగన్న వీరన్న బెజ్జనబోయిన నరేష్ రాంబాబు వేల్పుల వీరన్న భాస్కర్ గుగ్గిళ్ళ అంబేద్కర్ పీడియాల నవీన్ పిడమర్తి రాజేష్ సైదా లక్ష్మణరావు చామకూరి రమేష్ నాగన్న కట్ల రాము తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడి చిన్నారులకు దుస్తులు అందజేత



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామరెడ్డి మండల కేంద్రంలోనీ అంగన్వాడి కేంద్రం సెంటర్ ల లో ప్రభుత్వంఅందజేసిన చేసిన నూతన యూనిఫాం డ్రెస్సులు అంగన్వాడి చిన్నారులకు గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్ పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులకు స్వయంగా డ్రెస్సులు అందజేశారు, చిన్నారులు కొత్త యూనిపామ్ లు ధరించి ఆనందంగా కనిపించగా తల్లితండ్రులు కూడా ప్రభుత్వనికి, స్ధానిక ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలు ప్రతి చిన్నారికి తొలి విద్యాలయాలు అని తెలిపారు అలాగే చిన్ననాటి నుండి విద్యతోపాటు, ఆరోగ్యం, క్రమశిక్షణ వంటి మంచి అలవాట్లను అలవర్చుకోవడానికి అంగన్వాడి కేంద్రాలు ఎంతో దోహదపడతాయని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నవీన్, వార్డు సభ్యులు, అంగన్వాడి సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడి టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఫ్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభం

**ఎంఈఓ ఆనంద్ రావు**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఫ్రీ ప్రైమరీ పాఠశాలను గ్రామ సర్పంచ్ శివరాణి రాజేందర్ ప్రారంభించారు, ఫ్రీ ప్రైమరీ విద్యార్థులకు అక్షరాభ్యాసం మండల విద్యాధికారి ఆనందరావు, కాంప్లెక్స్ హెచ్ఎం ఆనంద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహులు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తో చేయించడం జరిగింది. ఎంఈఓమాట్లాడుతూ గ్రామంలోని నాలుగు సంవత్సరాలు నిండిన విద్యార్థులను ఫ్రీ ప్రైమరీ పాఠశాలలోచేర్పించవలసిందిగా కోరనైనది పాఠశాలలో వసతులతో కూడిన నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలో లభిస్తుందని త్వరలో విద్యార్థులకు అల్పాహారం అందించడం జరుగుతుందని తెలియజేశారు.

# రెండేళ్లలో ప్రతి రైతుకూ మ్యాప్‌తో కూడిన 'భూదార్'!

- 'భూభారతి'తో సరికొత్త భూ విప్లవం.. చింతకాని సభలో మంత్రి పొంగులేటి కీలక ప్రకటన
- ముల్లుగమాడ్ రైతులకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి చేతుల మీదుగా రికార్డుల పంపిణీ
- రెండేళ్లలోనే 71 వేల ఉద్యోగాల భర్తీ.. త్వరలోనే మరో 20 వేల నోటిఫికేషన్లు
- మహిళా సంఘాలకు సున్నా వడ్డీకే రూ.63 వేల కోట్లు.. ప్రతిపక్షాల అబద్ధాల ప్రచారాలపై మంత్రి పొంగులేటి ఫైర్



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** చింతకాని: "భూభారతి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాం. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రతి భూమినీ సర్వే చేసి, సాగులో ఉన్న ప్రతి రైతుకు మ్యాప్‌తో కూడిన 'భూదార్' కార్డును అందజేస్తాం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. చింతకాని మండలం జగన్నాథపురం వద్ద రాష్ట్ర రైతాంగానికి రూ.9 వేల కోట్ల 'రైతు భరోసా' నిధులను జమ చేసిన సందర్భంగా నిర్వహించిన చారిత్రాత్మక 'రైతు ఆశీర్వాద సభ'లో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ , పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ వేదికపై మంత్రి పొంగులేటి భూ సంస్కరణలతో పాటు ప్రభుత్వ ప్రగతిని వివరించారు.

**ముల్లుగమాడ్‌లో పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్!**

ఇప్పటికే ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూభారతి పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మధిర నియోజకవర్గంలోని ముల్లుగమాడ్ రెవెన్యూ గ్రామంలో సర్వే పూర్తి చేసి, సుమారు 476 మంది రైతులకు మ్యాప్‌లతో కూడిన భూదార్ కార్డులను సిద్ధం చేశామన్నారు. ఈ సభా వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా రైతులకు ఈ కార్డులను పంపిణీ చేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అందరికీ ఇదే పద్ధతిలో కార్డులు ఇస్తామని మంత్రి ప్రకటించారు.

**నిరుద్యోగులకు వరం... మహిళలకు అండ!**

ఈ రెండున్నర ఏళ్లలోనే సుమారు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే దృఢ సంకల్పంతో మహిళా సంఘాలకు రూ.63 వేల కోట్లను సున్నా వడ్డీకే అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని మంత్రి కొనియాడారు. నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు మొదటి రెండేళ్లలోనే రికార్డు స్థాయిలో 71 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, రాబోయే కొద్ది రోజుల్లోనే మరో 17 వేల నుంచి 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వబోతున్నామని సగర్వంగా ప్రకటించారు.

**అవినీతి పిల్లర్లపై కాళేశ్వరం...!**

ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాలేదని, చేతల్లో చూపిస్తోందని మంత్రి అన్నారు. గత పాలకులు తాము చేసిన తప్పులను, అబద్ధాలను ఈ ప్రభుత్వంపై రుద్దాలని చూస్తున్నారని మండిపడ్డారు. "ఎన్నికల ముందే చెప్పాం... కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రతి పిల్లర్‌లోనూ అవినీతి కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని. ఇవాళ అదే నిజమైంది" అని విమర్శించారు. నీటిపారుదల శాఖపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని, అబద్ధాల ప్రచారం మానుకోకపోతే ప్రజలు రాబోయే రోజుల్లోనూ తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

**పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లే లక్ష్యం!**

అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందించడమే రేవంత్ అన్న నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం ఇళ్ల స్థలాల పంపిణీకి సంబంధించి రెండవ విడత పూర్తి చేసిందని, రాబోయే రోజుల్లో మిగిలిన విడతలను కూడా శరవేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు.

## రైతులకు తగులుతున్న విద్యుత్ తీగలు

**విద్యుత్ తీగలు పైకి అమర్చాలి: రైతు లింగస్వామి**

**ఆత్మకూర్(ఎం) రాజముద్ర న్యూస్ :** పల్లెర్ల గ్రామ రైతు కన్నెబోయిన లింగస్వామి,బావి మరియు నరిగే వారి బావి దగ్గర రైతులకు తకుతున్న విద్యుత్ తీగలు గత సంవత్సరం నుండి తీగలను పైకి అమర్చాలని విద్యుత్ శాఖ అధికారులకు చెప్పిన తమ సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన రైతు కన్నెబోయిన లింగస్వామి తమ పొలం దున్నేటప్పుడు పొలం పనులు చేసేటప్పుడు చాల ఇబ్బంది అవుతుంది బిల్లులు సమయానికి వసూళ్లు చేస్తారు విద్యుత్ సరఫరా సరిగ్గా రావడం లేదు అని అన్నారు తక్షణమే విద్యుత్ తీగలను స్థంబాలు నాటి తీగలను పైకి అమర్చాలని తెలిపారు.



# రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి

**ఏవో భాను శ్రీ**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎల్-నినో ప్రభావం నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళికరూపొందించుకోవాలని సూచించడం జరిగింది. ఎల్ నినో అంటే ఏమిటి ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రం మధ్య తూర్పు భాగంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ పరిస్థితి.ఎల్ నినో కారణంగా తెలంగాణలో సాధారణంగా వర్షపాతం తగ్గి, వ్యవసాయం పై ప్రతికూల ప్రభావం ఉండే అవకాశం ఉంటుంది.ఈ మేరకు రామారెడ్డి మండల రైతులు అధిక నీటి అవసరం ఉన్న వరి పంట సాగును సాధ్యమైనంత వరకు తగ్గించి, ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి ఏవో భాను శ్రీ తెలిపారు, వారు మాట్లాడుతూ మొక్కజొన్న, సోయాబీన్, పెసర్లు, అలసందలు, మినుములు, కందులు, పత్తి, అలాగే వివిధ రకాల కూరగాయల వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు రైతులు మెరుగైన దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, నీటి నిల్వలు మరియు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు శాస్త్రీయ సలహాలను పాటిస్తూ పంటలను ఎంపిక చేసుకోవాలి రామారెడ్డి మండలంలోని రైతులు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకొని సాగు చేపట్టాలి అని తెలిపారు.

# చన్ గోముల్ పోలీస్ స్టేషన్, పరిగి సర్కిల్ కార్యాలయాని చార్మినార్ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ తనిఖీ




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వార్షిక తనిఖీలలో భాగంగా చార్మినార్ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిధిలోని చన్ గోముల్ పోలీస్ స్టేషన్‌తో పాటు పరిగి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా డీఐజీ కి ఘన స్వాగతం పలికారు. తనిఖీల సందర్భంగా పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, మాల్ఖానా, ఆయుధాగారం, వివిధ శాఖల పనితీరు, సిబ్బంది టర్న్‌అవుట్, క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణను కూలంకషంగా పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి వారి విధి నిర్వహణ, సంక్షేమం, పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చన్ గోముల్ పోలీస్ స్టేషన్, పరిగి సర్కిల్ కార్యాలయ ఆవరణల్లో మొక్కలు నాటినారు. వికారాబాద్ రక్షణ నేత్రం కార్యక్రమంలో భాగంగా పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో 110 కెమెరాలు, చన్ గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 61 కెమెరాలు మొత్తం 171 సీసీటీవీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ల పనితీరును పరిశీలించి, సీసీటీవీ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీస్ సేవలు అందించడం ప్రతి పోలీస్ అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, విజిబుల్ పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని, ముఖ్యంగా సీసీటీఎన్ ఎస్ 2.0, ఈ -సాక్ష్యం, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ దర్యాప్తు, సోషల్ మీడియా మానిటరింగ్ వంటి అంశాల్లో ప్రతి పోలీస్ అధికారి నైపుణ్యం పెంపొందించుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు నేరస్తుల కంటే ఒక అడుగు ముందుండే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. అదేవిధంగా డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణ, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను వేగంగా పరిష్కరించే విధంగా సేవలందించాలని సూచించారు. ఇటీవల కాలంలో ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు, రివార్డులు అందుకున్న పోలీస్ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించరు. ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా పనిచేసి జిల్లా పోలీస్ శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. అనంతరం వికారాబాద్ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వార్షిక తనిఖీల ముగింపు పరేడ్ లో డీఐజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసుల క్రమశిక్షణ, సమన్వయం, పరేడ్ నిర్వహణను పరిశీలించిన ఆయన, వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, నాయకత్వంలో జిల్లా పోలీస్ శాఖ అత్యంత క్రమశిక్షణతో, సమర్థవంతంగా పనిచేస్తోందని ప్రశంసించారు. పరేడ్‌లో పాల్గొన్న అన్ని ప్లాటూన్లు అత్యుత్తమ టర్న్‌అవుట్, క్రమశిక్షణను ప్రదర్శించాయని, ముఖ్యంగా పరేడ్ కమాండర్ నాగరాజు సమర్థవంతంగా పరేడ్‌ను నిర్వహించారని అభినందించారు. అలాగే అన్ని ప్లాటూన్లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచాయని, ముఖ్యంగా మహిళా పోలీస్ అధికారుల ప్లాటూన్ అత్యంత క్రమశిక్షణతో, అద్భుతంగా పరేడ్ నిర్వహించి ప్రత్యేక ప్రశంసలు అందుకుందని డీఐజీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా కృతజ్ఞతా ప్రసంగం చేస్తూ వార్షిక తనిఖీల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖకు విలువైన మార్గదర్శకాలు, సూచనలు అందించిన చార్మినార్ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ ఐపీఎస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డీఐజీ సూచించిన ప్రతి అంశాన్ని జిల్లా పోలీస్ శాఖలో సమర్థవంతంగా అమలు చేస్తామని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు మరింత పారదర్శకమైన, సమర్థవంతమైన పోలీస్ సేవలను అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా , జిల్లా డిసిఆర్‌బి డిఎస్‌పి జానయ్య, డిటిసి డిఎస్‌పి శ్రీనివాస్, వికారాబాద్ డిఎస్‌పి అంజయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, డి ఏ ఆర్ డిఎస్‌పి వీరేశ్ అధికారులు , ఇన్స్పెక్టర్ లు, ఆర్ఐ లు, ఎస్ఐ లు,ఆర్ఎస్ఐ లు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



**రాజముద్ర న్యూస్, తాండూర్:** తాండూర్ సెక్టార్లోని కాపువాడ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వరూపరాణి తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరభ్యాసం నిర్వహించి, విద్యాభ్యాసంలో తొలి అడుగు వేయించారు. అలాగే తల్లులకు రక్తహీనత నివారణ, పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని, తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎస్.ఉమారాణి, తాండూర్ పంచాయతీ కార్యదర్శి డి.దివాకర్, వోడ్నాల రమేష్, అంగన్వాడీ టీచర్లు అరవింద, సరిత, ప్రేమలత, శకుంతలతో పాటు తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి రైతుల కల సాకారం

- ఆగస్టు 15 నాటికి సత్తుపల్లికి గోదావరి జలాలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** సత్తుపల్లి ప్రాంత రైతుల చిరకాల ఆకాంక్ష అయిన గోదావరి జలాలను ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి తప్పకుండా సత్తుపల్లికి చేరవేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15 నాటికి సత్తుపల్లి ప్రాంతానికి గోదావరి జలాలు అందేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు వేగంగా పూర్తి చేస్తోందని తెలిపారు. రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గోదావరి జలాల ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు ప్రజల తాగునీటి అవసరాలు కూడా తీరనున్నాయని వివరించారు. మంత్రి చేసిన ప్రకటనతో సత్తుపల్లి నియోజకవర్గ రైతులు, ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గోదావరి జలాల రాకతో వ్యవసాయ రంగానికి కొత్త ఊపు వస్తుందని, పంటల ఉత్పాదకత పెరిగి రైతుల జీవనోపాధి మెరుగుపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజలకు మరింత చేరువలో ప్రభుత్వ సేవలు

భరంపూర్లో మీసేవ కేంద్రం ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలను సులభంగా, వేగంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడిడ అన్నారు. తలమడుగు మండలంలోని భరంపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు కుల, ఆదాయ, జనన, మరణ ధృవీకరణ పత్రాలతో పాటు ఇతర ప్రభుత్వ ఆన్లైన్ సేవల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం ఇకపై ఉండదన్నారు. భరంపూర్లోనే అన్ని ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజల సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని తెలిపారు. మీసేవ కేంద్రం నిర్వాహకులు ప్రజలకు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవల విస్తరణతో ప్రభుత్వ సేవలు మరింత ప్రజలకు చేరువవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్ద ముడుపు కేదారేశ్వర రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్ కసలాల, బొల్లరపు బాపన్న, ప్రకాష్ దొర, లోక ప్రవీణ్ రెడ్డి, గాజుల సాంబశివ, ఎస్కే అలీమ్, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఎదుగుదలకు అంగన్వాడీల పాత్ర కీలకం



**రాజముద్ర న్యూస్, గుడిహత్నూర్:** చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మచ్చపూర్ సర్పంచ్ ప్రతాప్ రాథోడ్ అన్నారు. శుక్రవారం గ్రామలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో పరిశుభ్రత, చిన్నారుల హాజరు, పౌష్టికాహార పంపిణీ, నిర్వహణ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన అల్పాహార కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అందిస్తున్న ఖిచిడీని సర్పంచ్ చిన్నారులతో కలిసి కూర్చొని స్వయంగా రుచి చూశారు. ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులకు పరిశుభ్రమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు సేవలను నాణ్యతతో అందించి, కేంద్రంలో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## తెలుగు విశ్వవిద్యాలయం – తెలుగు జాతి ఆత్మగౌరవానికి చిరునామా



**రామంతపూర్, జులై 9, (రాజముద్ర న్యూస్ ):** భాష అనేది కేవలం సంభాషణకు ఉపయోగించే సాధనం మాత్రమే కాదు. అది ఒక జాతి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం, కళలు, జీవన విధానానికి ప్రతిబింబం. అలాంటి తెలుగు భాషకు, తెలుగు సంస్కృతికి, జానపద కళలకు, సాహిత్యానికి, నాటక రంగానికి, సంగీతానికి, నృత్యానికి, పరిశోధనలకు అంకితమైన విశిష్ట విద్యాసంస్థే తెలుగు విశ్వవిద్యాలయం. తెలుగు భాష, సంస్కృతికి ప్రత్యేక విశ్వవిద్యాలయం అవసరాన్ని గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1985లో తెలుగు విశ్వవిద్యాలయాన్ని స్థాపించింది. అనంతరం మహాకవి, ప్రజాకవి ★★ గారి సేవలను స్మరిస్తూ దీనికి "పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం" అనే పేరు పెట్టబడింది. భాష, సాహిత్యం, చరిత్ర, జానపద విజ్ఞానం, లలిత కళలు, నాటక రంగం, సంగీతం, నృత్యం, యక్షగానం, శిల్పకళ, వాస్తు, హరికథ వంటి అనేక రంగాల్లో విద్య, పరిశోధన, ప్రచురణలను ప్రోత్సహిస్తూ ఈ విశ్వవిద్యాలయం విశిష్ట సేవలు అందిస్తోంది. దశాబ్దాలుగా ఈ విశ్వవిద్యాలయం వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందించింది. అనేక మంది రచయితలు, కవులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పరిశోధకులు, జర్నలిస్టులు, రంగస్థల కళాకారులు, సినీ, టెలివిజన్ రంగానికి చెందిన కళాకారులు, జానపద కళాకారులు, సంగీత విద్వాంసులు ఈ విశ్వవిద్యాలయం ద్వారా ప్రోత్సాహం పొంది తమ ప్రతిభను దేశ విదేశాల్లో చాటుకున్నారు. తెలుగు భాషాభివృద్ధికి, కళల పరిరక్షణకు ఈ విశ్వవిద్యాలయం చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. ఇది కేవలం డిగ్రీలు ఇచ్చే విశ్వవిద్యాలయం కాదు. కనుమరుగవుతున్న జానపద కళలను నమోదు చేసి, అరుదైన గ్రంథాలను ప్రచురించి, ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని పరిశోధించి, భావితరాలకు అందిస్తున్న విజ్ఞాన భాండాగారం. ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాష ప్రతిష్ఠను పెంచడంలో కూడా ఈ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించింది. ఒక తల్లి తన పిల్లలకు ఎలా జీవన మార్గాన్ని చూపిస్తుందో, తెలుగు విశ్వవిద్యాలయం కూడా వేలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దింది. ఈ విశ్వవిద్యాలయంలో చదివిన వారు నేడు సమాజంలో గౌరవప్రదమైన స్థానాల్లో ఉన్నారు. వారు సంపాదించిన జ్ఞానం, గౌరవం, గుర్తింపు వెనుక ఈ విద్యాసంస్థ పాత్ర ఎంతో గొప్పది. అందుకే ఈ విశ్వవిద్యాలయాన్ని కాపాడుకోవడం ప్రతి తెలుగు వ్యక్తి బాధ్యత. ఇది ఒక భవనం గానీ, ఒక కార్యాలయం గానీ కాదు; ఇది తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక. దీని అభివృద్ధి, పరిరక్షణకు ప్రభుత్వం, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, కళాకారులు, రచయితలు, విద్యార్థులు, తెలుగు భాషాభిమానులు అందరూ కలిసి కృషి చేయాలి. ఒక భాష బతకాలంటే ఆ భాషను బోధించే విద్యాసంస్థలు బలంగా ఉండాలి. ఒక సంస్కృతి నిలవాలంటే దానిని సంరక్షించే సంస్థలు సజీవంగా ఉండాలి. తెలుగు విశ్వవిద్యాలయం అలాంటి అరుదైన సంస్థ. దీనిని పరిరక్షించడం అంటే మన భాషను, మన చరిత్రను, మన సంస్కృతిని, మన భావితరాల భవిష్యత్తును పరిరక్షించినట్లే. తెలుగు విశ్వవిద్యాలయం మన వారసత్వం... దానిని కాపాడటం మన అందరి బాధ్యత.

### ఆత్మకూరు మండలం PACS పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న

## ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్:** ఆత్మకూర్.( ఎం )మండల PACS నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహణయాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హాజరై నూతనంగా నియమితులైన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండల PACS చైర్మన్‌గా యాస లక్ష్మారెడ్డి తన పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు.అనంతరం నూతన పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అభినందిస్తూ, రైతులకు సహకార సంఘాలు మరింత చేరువ కావాలని, పారదర్శకంగా సేవలందిస్తూ రైతుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సహకార సంఘాలు రైతులకు ఎరువులు, విత్తనాలు, రుణాలు, పంట కొనుగోలు వంటి సేవలను సమర్థవంతంగా అందించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను ప్రతి అర్హ రైతుకు అందేలా PACS పాలకవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా నిజాయితీ, బాధ్యతతో విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సహకార శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, PACS పాలకవర్గ సభ్యులు, రైతులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# చెన్నైలో బిగ్‌బాష్ తొలి విదేశీ మ్యాచ్







**చెన్నై, జులై 10:** ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ఆదరణ పొందిన లీగ్‌లలో ఒకటైన ఆస్ట్రేలియా బిగ్‌బాష్ లీగ్ చరిత్రలో తొలిసారిగా విదేశీ గడ్డపై అధికారిక మ్యాచ్‌ను నిర్వహించనుంది. బిగ్‌బాష్ లీగ్ 2026-27 సీజన్‌కు సంబంధించిన ప్రారంభ మ్యాచ్‌ను తమిళనాడు రాజధాని చెన్నైలో నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మెల్‌బోర్న్‌లో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించిన వివరాల ప్రకారం డిసెంబర్ 12న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో ఈ చారిత్రాత్మక మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ మెల్‌బోర్న్ రెనెగేడ్స్ జట్టు, పెర్త్ స్కార్చర్స్‌తో తలపడనుంది. ఈ పోరులో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ హోం జట్టుగా బరిలోకి దిగనుండటం విశేషం. విదేశీ దేశీయ క్రికెట్ లీగ్‌కు చెందిన అధికారిక మ్యాచ్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి కావడం మరో ప్రత్యేకతగా నిలిచింది. ఈ మ్యాచ్ విజయవంతంగా నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి కూడా పూర్తి సహకారం అందించనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ భారత్, ఆస్ట్రేలియా మధ్య క్రీడా సంబంధాలను మరింత బలోపేతం చేసే చారిత్రాత్మక అడుగుగా ఈ మ్యాచ్‌ను అభివర్ణించారు. చెన్నైలో జరిగే ఈ ప్రత్యేక పోరులో గెలుపోటముల కంటే ఆట స్ఫూర్తి, ఇరు దేశాల స్నేహబంధమే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. బిగ్‌బాష్ లీగ్‌ను భారత క్రికెట్ అభిమానులకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మ్యాచ్‌తో పాటు చెన్నైలో సాంస్కృతిక, చలనచిత్ర ఉత్సవాలను కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల ద్వారా రెండు దేశాల మధ్య పర్యాటకం, వ్యాపారం, సాంస్కృతిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆస్ట్రేలియాలో ఐపీఎల్‌కు బాటలు






**మెల్‌బోర్న్, జులై 10 :** భారత్-ఆస్ట్రేలియా క్రికెట్ సంబంధాలు మరో కీలక మైలురాయిని చేరుకోనున్నాయి. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ టీ20 టోర్నీ బిగ్‌బాష్ లీగ్ చరిత్రలో తొలిసారిగా ఆ దేశం వెలుపల మ్యాచ్ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. డిసెంబర్ 12న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం (చేపాక్) స్టేడియంలో మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్ల మధ్య ప్రారంభ మ్యాచ్ జరగనుంది. ఈ చారిత్రాత్మక ప్రకటనను మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ సంయుక్తంగా వెల్లడించారు. రెండు దేశాల మధ్య దౌత్య, క్రీడా సంబంధాలను మరింత బలోపేతం చేసే కార్యక్రమాల్లో భాగంగా ఈ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. అయితే ఈ సహకారం బిగ్‌బాష్ లీగ్‌తో మాత్రమే పరిమితం కాకుండా, ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లను కూడా భవిష్యత్తులో ఆస్ట్రేలియాలో నిర్వహించే అవకాశాలపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఆస్ట్రేలియా మీడియా కథనాల ప్రకారం, చెన్నైలో బిగ్‌బాష్ ప్రారంభ మ్యాచ్‌ను ప్రతి ఏడాది నిర్వహించేలా ఒప్పందం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. దీనికి ప్రతిగా ఆస్ట్రేలియాలో ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించాలని క్రికెట్ ఆస్ట్రేలియా భారత క్రికెట్ నియంత్రణ మండలికి ప్రతిపాదించింది. ప్రస్తుతం ఇరు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య ఈ అంశంపై అంతర్గత చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ ప్రతిపాదనకు భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆమోదం తెలిపితే, భవిష్యత్తులో మెల్‌బోర్న్, సిడ్నీ వంటి నగరాల్లో ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం ఏర్పడనుంది. దీంతో ఆస్ట్రేలియాలో నివసిస్తున్న భారత అభిమానులు తమ అభిమాన జట్ల మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం దక్కనుంది.క్రీడా విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం అమల్లోకి వస్తే రెండు దేశాల మధ్య క్రికెట్ సహకారం మరింత బలపడటంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా టీ20 క్రికెట్‌కు కొత్త దిశను చూపించే పరిణామంగా నిలిచే అవకాశం ఉంది.

# పర్ఫామెన్స్‌కు విలువ లేదా?

## టీ20ల్లో టీమిండియా వరుస పరాజయాలు

### సిఫార్సుల ద్వారానే ఛాన్స్‌లు..

### టీమిండియా ఎంపికలపై విమర్శలు!

### ఐర్లాండ్‌పై రెండు, ఇంగ్లండ్‌పై మూడు టీ20ల్లో ఓటమి

**ముంబై:** టీమిండియా గత 5-6 టీ20ల్లో వరుస పరాజయాలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఐర్లాండ్‌పై రెండు, ఇంగ్లండ్‌పై మూడు టీ20ల్లో భారత్ ఓడిపోయింది. ఈ నేపథ్యంలో భారత జట్టు ఎంపికపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ సాగుతోంది. ముఖ్యంగా ఆటగాళ్ల ఎంపికలో ప్రతిభ కంటే వ్యక్తిగత అనుబంధాలు, లాబీయింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ అభిమానులు, నెటిజన్లు.. బీసీసీఐ, సెలెక్టర్లపై విమర్శలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఓ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వైరల్ పోస్టులో టీమిండియా ఆటగాళ్ల ఎంపికపై నెటిజెన్స్ వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. అభిషేక్ శర్మకు యువరాజ్ సింగ్ మద్దతు కారణంగా అవకాశం దక్కిందని, 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అతని వయస్సు కారణంగా ప్రత్యేక ప్రాధాన్యం లభించిందని నెటిజెన్స్ పేర్కొన్నారు. ఇషాన్ కిషన్ మాత్రం దేశవాళీ క్రికెట్‌లో రాణించి తిరిగి భారత జట్టులోకి వచ్చిన ఏకైక ఆటగాడని అభిప్రాయపడ్డారు. శ్రేయస్ అయ్యర్ దేశవాళీ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చి జట్టులో చోటు సంపాదించాడని పేర్కొన్నారు. శివమ్ దూబేను స్పిన్ బౌలర్లపై భారీ షాట్లు ఆడగలడనే ఉద్దేశంతో ఎంపిక చేసినా.. స్పిన్ బౌలింగ్‌కే బలవుతున్నాడని విమర్శించారు. తిలక్ వర్మ ఎంపిక వెనుక రోహిత్ శర్మ మద్దతు, ముంబై లాబీ ప్రభావం ఉందని ఆరోపించారు. అక్షర్ పటేల్‌కు 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ఆడిన కీలక ఇన్నింగ్స్, ఫీల్డింగ్ కారణంగా అవకాశాలు కొనసాగుతున్నాయని.. వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణాలకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మద్దతు కారణమని ఆ పోస్టులో నెటిజెన్స్ పేర్కొన్నారు. భారత క్రికెట్‌లో ప్రస్తుతం ప్రదర్శన కంటే ఇతర అంశాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. రజత్ పాటీదార్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్ ప్రస్తుత టీ20 జట్టులోని చాలా మంది ఆటగాళ్ల కంటే మెరుగైన ప్రదర్శన చేయగలరని అభిప్రాయపడ్డారు. ఇషాన్, శ్రేయాస్ మాత్రమే అద్భుత ప్రదర్శనతో జట్టులో చోటు సంపాదించారని ఫాన్స్ పేర్కొంటున్నారు.

# లార్డ్స్‌లో తొలి టెస్టు

## స్మృతి మంధాన అరుదైన ఘనత



భారత మహిళా జట్టు ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో తొలిసారిగా టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఆతిథ్య ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఈ ఏకైక టెస్టులో.. టీమిండియా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అరుదైన ఘనత సాధించింది. అంతర్జాతీయ కెరీర్‌లో అతి పిన్న వయసులో 300 మ్యాచ్‌లు ఆడిన బ్యాటర్‌గా నిలిచింది. ఈ క్రమంలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన భారత మహిళల జాబితాలో స్మృతి మూడో స్థానంలో ఉంది. 2013లో బంగ్లాదేశ్‌పై టీ20 మ్యాచ్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన స్మృతి.. ఇప్పటి వరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 300 మ్యాచ్‌లు ఆడింది. ఈ జాబితాలో ప్రస్తుతం భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(374) అగ్రస్థానంలో ఉండగా, భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్(333) రెండో స్థానంలో కొనసాగుతోంది. 29ఏళ్ల స్మృతి ఇప్పటివరకు తొమ్మిది టెస్టులు, 120 వన్డేలు, 171 టీ20 మ్యాచులు ఆడింది. మొత్తం 10వేలకుపైగా పరుగులు చేసింది. ఇందులో 17 సెంచరీలు, 74 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 67 బంతుల్లో 56 పరుగులు చేసి క్రీజులో కొనసాగుతోంది. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. లంచ్ బ్రేక్ సమయానికి 3 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. షెఫాలీ వర్మ(0), యాస్తికా భాటియా(12) నిరాశ పర్చారు. జెమీమా రోడ్రిగ్స్(35) పరుగులు చేసి ఔటైంది. కాగా స్మృతి మంధాన(56బి), హర్మన్ ప్రీత్ కౌర్(14బి) క్రీజులో కొనసాగుతున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ బెల్, లారెన్ ఫైలర్, ఇస్సీ వాంగ్ తలొక వికెట్ పడగొట్టారు.




# లార్డ్స్‌లో భారత మహిళలకు చారిత్రక టెస్టు

**లండన్, జులై 10:** టీ20 ప్రపంచకప్‌లో నిరాశాజనక ప్రదర్శనతో గ్రూప్ దశలోనే నిష్క్రమించిన భారత మహిళల క్రికెట్ జట్టు మరో కీలక సవాల్‌కు సిద్ధమైంది. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్ మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో శుక్రవారం భారత జట్టు బరిలోకి దిగింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు ముందుగా ఫీల్డింగ్ ఎంచుకోవడంతో భారత మహిళలు తొలుత బ్యాటింగ్ ప్రారంభించారు. లార్డ్స్ మైదానంలో భారత మహిళల జట్టు టెస్టు మ్యాచ్ ఆడటం ఇదే తొలిసారి కావడం విశేషం. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మక వేదికగా గుర్తింపు పొందిన ఈ మైదానంలో తొలి టెస్టు ఆడుతూ భారత మహిళలు చారిత్రక ఘట్టాన్ని నమోదు చేశారు. ఈ మ్యాచ్ ద్వారా ఇరు జట్లు విజయంతో సిరీస్‌ను ముగించాలనే లక్ష్యంతో బరిలోకి దిగాయి. భారత్ తరఫున టీ20 ప్రపంచ నంబర్-ఒకటి బౌలర్ శ్రీచరణి టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేస్తుండగా, ఇంగ్లండ్ తరఫున క్యాప్సీ, మ్యాడీలు తొలి టెస్టు మ్యాచ్ ఆడుతున్నారు. ఈ అరంగేట్ర ఆటగాళ్ల ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మహిళల టెస్టు మ్యాచ్‌లు నాలుగు రోజుల పాటు జరుగుతాయి. ఇంగ్లండ్ తుది జట్టు: నాట్ సీవర్ బ్రంట్ (కెప్టెన్), టామీ బీమౌంట్, మియా బౌచీర్, హీథర్ నైట్, క్యాప్సీ, అమీ జోన్స్ (వికెట్ కీపర్), మ్యాడీ, సోఫీ ఎకిల్‌స్టన్, ఇస్సీ వాంగ్, లారెన్ బెల్, లారెన్ ఫైలర్. భారత్ తుది జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, యాస్తికా భాటియా, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), దీప్తి శర్మ, స్నేహ్ రాణా, సయాలీ, శ్రీచరణి, క్రాంతి గౌడ్.

# టీ20ల్లో శ్రేయస్ అరుదైన రికార్డు

## జట్టు విఫలమైనా 'సర్పంచ్ సాబ్' ఒంటరి పోరాటం!

ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత జట్టు వరుసగా నిరాశపరుస్తున్నా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాత్రం తన బ్యాటింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. ఇప్పటికే మూడు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసిన భారత్.. బ్రిస్టల్ వేదికగా జరిగిన నాలుగో టీ20లోనూ బ్యాటింగ్‌లో తడబడింది. అయితే కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఒంటరి పోరాటంతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. టాప్ ఆర్డర్, మిడిల్ ఆర్డర్ వరుసగా విఫలమైన వేళ శ్రేయస్ అయ్యర్ అద్భుతంగా బ్యాట్ ఊపాడు. చివరి వరకు అజేయంగా నిలిచిన ఆయన 80 పరుగులు చేసి భారత్‌ను 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగుల వరకు తీసుకెళ్లాడు. శ్రేయస్ తర్వాత భారత బ్యాటర్లలో అత్యధిక స్కోరు కేవలం 22 పరుగులే కావడం ఆయన ఇన్నింగ్స్ ఎంత విలువైనదో చెప్పకనే చెబుతోంది. ఈ ఇన్నింగ్స్‌తో శ్రేయస్ అయ్యర్ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. భారత జట్టులో మిగతా ఏ బ్యాటర్ కూడా 25 పరుగులు దాటని మ్యాచ్‌ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్లు నమోదు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆయన మూడో స్థానంలో నిలిచాడు. ఇంగ్లండ్‌పై చేసిన అజేయ 80 పరుగులు ఈ ప్రత్యేక జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఈ జాబితాలో తొలి స్థానంలో మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఉన్నాడు. అమెరికాపై అజేయంగా 84 పరుగులు చేసిన ఆ మ్యాచ్‌లో మరో భారత బ్యాటర్ 25 పరుగులకు మించి చేయలేదు. రెండో స్థానంలో విరాట్ కోహ్లీ ఉన్నాడు. ఆస్ట్రేలియాపై ఆయన చేసిన అజేయ 82 పరుగుల ఇన్నింగ్స్ సమయంలో మిగతా బ్యాటర్లలో ఎవరూ 21 పరుగులు దాటలేదు. విశేషమేమిటంటే.. ఈ ప్రత్యేక జాబితాలో శ్రేయస్ అయ్యర్ పేరు ఒకసారి కాదు, మూడు సార్లు ఉంది. ఇంగ్లండ్‌పై చేసిన అజేయ 80 పరుగులతో పాటు, శ్రీలంకపై అజేయ 73 పరుగులు, మరోసారి ఇంగ్లండ్‌పైనే చేసిన 67 పరుగుల ఇన్నింగ్స్‌లు కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. జట్టు మొత్తం విఫలమైన సందర్భాల్లో కూడా బాధ్యత తీసుకుని ఒంటరిగా పోరాడే బ్యాటర్‌గా శ్రేయస్ తన విలువను మరోసారి నిరూపించాడు.



# జన నాయగన్‌కు ఏ సర్టిఫికెట్

## పలు మార్పులు సూచించిన సెన్సార్ బోర్డు

తమిళనాడు సీఎం, నటుడు విజయ్ కథానాయకుడిగా, హెచ్.వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన 'జన నాయగన్' చిత్రం ఎట్టకేలకు సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. దాదాపు ఏడు నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత సెన్సార్ బోర్డు ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. అయితే మొత్తం మూడు గంటల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలో దాదాపు 12 కీలక మార్పులు చేయాలని బోర్డు సూచించింది. ఇందులో భాగంగా విజయ్ నేతృత్వంలోని రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ప్రస్తావన ఉన్న డైలాగ్‌లను పూర్తిగా తొలగించాల్సి ఉంటుందని. అలాగే 'అంబేడ్కర్ చట్టం' అనే డైలాగ్‌ను మార్చాలని, ఓ పుస్తకం కవర్‌పై అంబేడ్కర్ ఉన్న విజువల్స్‌ను సవరించాలని బోర్డు స్పష్టం చేసింది. ఇక దేశభక్తికి సంబంధించిన అంశాల్లో భాగంగా భారత జాతీయ జెండా కింద పడుతున్నట్లు ఉన్న ఒక కీలకమైన షాట్‌ను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. వీటితో పాటు సినిమాలో 'రంగనాథర్', 'ఓం' అనే పదాలతో పాటు 'ఆపరేషన్ మేలుహా' వివరణలో వచ్చే 'న్యూ ఇండియా' అనే పదాన్ని మ్యూట్ చేయాల్సిందిగా పేర్కొంది. సమాజంలో సున్నితమైన అంశాలకు సంబంధించి ఒక చిన్నారిని తగలబెడుతున్నట్లు ఉన్న విజువల్స్‌ను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో వేరే విజువల్స్ రీప్లేస్ చేయాలని బోర్డు వెల్లడించింది. అలాగే సినిమాలో 'షీలా రాణి' అనే పేరు ఎక్కడ వచ్చినా మార్చాలని, అంతర్జాతీయ అంశాలకు సంబంధించిన సద్దాం హుస్సేన్ ఉరితీత డైలాగ్‌ను కూడా మ్యూట్ లేదా రీప్లేస్ చేయాలని సూచించింది. వీటితో పాటు మరికొన్ని సన్నివేశాల్లో వచ్చే వివాదాస్పద పదాలను కూడా మ్యూట్ చేయాలని సెన్సార్ బోర్డు ఆదేశాల జాబితాలో పేర్కొంది. ఈ సినిమాలో విజయ్‌కు జోడీగా పూజా హెగ్డే నటించగా, మమితా బైజు కీలక పాత్ర పోషించిన ఈ చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ భారీ మార్పులన్నింటినీ పూర్తి చేసుకుని జులై 24న 'జన నాయగన్' థియేటర్‌లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.








# హీరో అవకాశం ఇస్తామంటూ మూడున్నర కోట్లు వసూలు

## పిల్ల జమీందార్ నిర్మాత దర్శకులపై కేసు నమోదు


**హైదరాబాద్, జూలై 10:** తెలుగు సినిమా రంగంలో హీరోగా ఎంట్రీ ఇప్పిస్తామంటూ భారీ మోసానికి పాల్పడిన వ్యవహారంలో టాలీవుడ్ హిట్ చిత్రం 'పిల్ల జమిందార్' దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబు, నిర్మాత విజయలక్ష్మిలపై సైబరాబాద్ పోలీస్ పరిధిలో కేసు నమోదైంది. బాధితుల కథనం ప్రకారం.. ఒక యువకుడిని టాలీవుడ్‌లో హీరోగా పరిచయం చేస్తామంటూ నమ్మించిన దర్శకుడు అశోక్ బాబు, సదరు యువకుడి తల్లిదండ్రుల నుండి విడతల వారీగా దాదాపు రూ.3.5 కోట్ల రూపాయలు వసూలు చేశారు. అయితే, డబ్బులు తీసుకుని చాలా కాలం గడుస్తున్నా సినిమా ఊసే ఎత్తకపోగా, యువకుడిని హీరోగా లాంచ్ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీనితో మోసపోయామని గ్రహించిన బాధితులు తమ డబ్బులను తిరిగి ఇవ్వాల్సిందిగా నిలదీశారు. తీసుకున్న భారీ మొత్తాన్ని తిరిగి ఇచ్చేందుకు కూడా నిరాకరించడంతో, బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగానికి చెందిన పోలీసులు దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబుతో పాటు నిర్మాత విజయలక్ష్మిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరిద్దరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. టాలీవుడ్‌లో ఈ తరహా మోసం బయటపడటం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

# ఫిల్మ్ నగర్‌లో నటుడి ఇంట్లోకి దూసుకొచ్చిన కారు

## మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేసిన యువకులు

హైదరాబాద్, జూలై 10: హైదరాబాద్ ఫిలింనగర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి నేరుగా టాలీవుడ్ నటుడు ధర్మ నివాసంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంటి గేటు, ప్రహరీ గోడ ధ్వంసమయ్యాయి. అయితే ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. కారులో ప్రయాణిస్తున్న యువకులు అతివేగంగా వాహనాన్ని నడపడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు రోడ్డుపై నుంచి నేరుగా నటుడు ధర్మ ఇంటి ప్రాంగణంలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఘటన సమయంలో కారులో ఉన్న యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ధర్మ కుటుంబ సభ్యులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని కారులో ఉన్న యువకులను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.





# 40 ప్లస్‌లోనూ స్టన్నింగ్ లుక్

## వైరల్ అవుతున్న విమలా రామన్ ఫొటోలు

మలయాళ, తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి విమలా రామన్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. 44 ఏళ్ల వయసులోనూ అదే ఫిట్‌నెస్, అదే గ్లామర్‌ను మెయింటైన్ చేస్తూ అభిమానులను ఫిదా చేస్తోంది. తమిళ చిత్రం 'పోయి'తో సినీ రంగంలో అడుగుపెట్టిన విమలా రామన్.. అనంతరం 'టైమ్' సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. వరుసగా పలు మలయాళ చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. తెలుగులో 'ఎవరైనా ఎప్పుడైనా' సినిమాతో ప్రేక్షకులకు పరిచయమైన ఆమె.. తొలి చిత్రంతోనే అందం, అభినయంతో ఆకట్టుకుంది. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాల్లో నటించినప్పటికీ, ఇటీవల కాలంలో సినిమాల సంఖ్య తగ్గింది. సినిమాల్లో తక్కువగా కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం విమలా రామన్ చాలా యాక్టివ్‌గా ఉంటోంది. తరచూ తన గ్లామరస్ ఫోటోషూట్లను అభిమానులతో పంచుకుంటూ నెట్టింట సందడి చేస్తోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. లైట్ పింక్ స్లీవ్‌లెస్ డ్రెస్‌లో స్టైలిష్‌గా మెరిసిన విమలా.. ట్రెండీ లుక్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఎద, నడుము అందాలు హైలైట్ అయ్యేలా ఇచ్చిన స్టైలిష్ పోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొన్ని ఫొటోల్లో కురులను ముఖంపైకి వదిలి, మరికొన్నింటిలో వెనక్కి సర్దుకుని డిఫరెంట్ లుక్స్‌లో కనిపించింది. ఒక చేతికి బ్రేస్‌లెట్, వేళ్లకు ఉంగరాలు ధరించి తన స్టైలింగ్‌కు మరింత అందాన్ని జోడించింది. మొత్తంగా 40 ప్లస్‌లోనూ తన గ్లామర్ ఏమాత్రం తగ్గలేదని మరోసారి నిరూపించిన విమలా రామన్.. తాజా ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులు ఆమె అందంపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.




# కొత్త కథనంతో వచ్చిన లెనిన్

## అఖిల్ నటనా తీరు అద్భుతం

టైటిల్ ప్రకటించిన నాటి నుంచీ అఖిల్ 'లెనిన్' సినిమాపై అంచనాలు మొదలయ్యాయి. అఖిల్ రగ్గడ్ గెటప్, కథా నేపథ్యం, ప్రచార చిత్రాలు, విడుదలైన పాటలు.. ఇవన్నీ సినిమాపై ఆసక్తిని పెంచాయి. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాతలు కావడంతో కచ్చితంగా సినిమా బావుంటుందని ఆడియన్స్ ఫిక్సయిపోయారు. అఖిల్ కెరీర్‌లో 'లెనిన్'కి వచ్చినంత హైప్ మరే సినిమాకూ రాలేదన్నది నిజం. ఎట్టకేలకు ఈ శుక్రవారం 'లెనిన్'గా అఖిల్ థియేటర్లలోకి అడుగపెట్టాడు. ఇది రాయలసీమలోని రామాపురం అనే గ్రామం పగలకు, ప్రతీకారాలకు దూరంగా ఉంటుంది. రక్తం ఆ నేలను అప్పటివరకూ తాకలేదు. ఆ ఊరిలో సంప్రదాయ జాతర జరుగుతుండగా, ఓ పదేళ్ల పిల్లాడు ఆ ప్రాంతంలోకి అడుపెట్టాడు. అ పిల్లాడి పేరు 'లెనిన్'. అమ్మానాన్న లేని అనాథ అయిన లెనిన్‌ని ఆ ఊరి పెద్దావిడ(ఈశ్వరీరావు) అక్కున చేర్చుకుంది. ఆమె కొడుకైన వసంత్(ప్రమోద్ పంజు)తో లెనిన్‌కి బలమైన స్నేహబంధం ఏర్పడింది. వసంత్‌తో పాటు లెనిన్ కూడా ఆ ఇంట్లోనే పెరిగి పెద్దయ్యాడు.. కట్ చేస్తే.. కొన్నేళ్ల తర్వాత లెనిన్ జైలు నుంచి విడుదలయ్యాడు. ఆ ఊరిలోకి అడుగుపెట్టి ఆ ఊరి జనాలైన వందమందిని నరికి చంపాడు. చివరకు తన ప్రాణస్నేహితుడైన వసంత్‌ని కూడా అతి దారుణంగా పొడిచి చంపాడు. అసలు లెనిన్ జైలుకి ఎందుకెళ్లాడు? రక్తం రుచే తెలియని ఆ నేలపై రక్తపాతం ఎందుకు సృష్టించాడు? ప్రాణ స్నేహితుడైన వసంత్ ప్రాణాన్ని ఎందుకు బలి తీసుకున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ. పరువు, ప్రేమ, స్నేహం, నమ్మకద్రోహం నేపథ్యంలో సాగే కథ ఇది. కథకుడు, దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరి ఈ కథను నడిపించిన తీరు బావుంది. ఇదొక విభిన్నమైన స్క్రీన్‌ప్లే. ప్రథమార్థం ఇదేదో పరువు కోసం ప్రాణాలు తీసే వ్యక్తుల చుట్టూ తిరిగే కథగానే అంతా భావిస్తారు. కానీ సెకండాఫ్‌లో ఈర్ష్యా, ద్వేషం, నమ్మకద్రోహం కోణాలు కథలో బహిర్గతమవుతాయి. ఈర్ష్యా, ద్వేషం అనేవి పవిత్రమైన స్నేహాన్ని సైతం నిర్వీర్యం చేస్తాయని ఈ కథ ద్వారా మురళీకిశోర్ అబ్బూరి తెలిపారు. అనాథగా ఆ ఊరు వచ్చిన లెనిన్ 'నా' అనుకున్న వారందర్నీ సంపాదించుకున్నానని భ్రమ పడతాడు. తాను ఎప్పటికీ అనాథనేనని తెలుసుకుకోవడంతో కథ ముగుస్తుంది. స్నేహానికీ, ప్రేమకీ లొంగిపోయే లెనిన్ నమ్మకద్రోహానికి బలైపోయాడు. అదే ఈ సినిమా కథ. చాలా సీరియస్ స్జబెక్ట్ ఇది. క్షణక్షణానికి మారుతున్న వ్యక్తులు మనస్తత్వాలను ఈ సినిమాలో చూడొచ్చు. మంచి వాళ్లుగా కనిపిస్తున్న మేకవన్నె పులుల మధ్య జీవితాన్ని సాగించి, సర్వం కోల్పోయిన లెనిన్‌ని ఈ సినిమాలో చూడొచ్చు. ప్రథమార్థం చివరి ఇరవై నిమిషాల్లో సినిమాలోని అసలు కథ మొదలైంది. కథలోకి వెళ్లడం ఆలస్యం కావడం వల్ల కథనం నిదానించినట్టు అనిపిస్తుంది. ద్వితీయార్థం ఆద్యంతం ఊహించని మలుపులతో ఆసక్తికరంగా సినిమా సాగింది. మొత్తంగా దర్శకుడు మురళీకిశోర్ వైవిధ్యమైన కథనంతో ఈ కథను నడిపించి సినిమాను నిలబెట్టారు. ఇక 'లెనిన్'గా కొత్త అఖిల్‌ని ఈ సినిమాలో చూస్తారు. ఇప్పటివరకూ ఆయన చేసిన సినిమాలన్నీ ఒకెత్తూ, 'లెనిన్' ఒకెత్తు. అమాయకత్వం, మంచి తనం, మూర్ఖత్వం కలగలిసిన ఈ పాత్రలో అఖిల్ జీవించాడనే చెప్పాలి. అతనిలోని పరిపూర్ణమైన నటుడ్ని 'లెనిన్'లో చూడొచ్చు. ముఖ్యంగా ద్వితీయార్ధంలో అఖిల్ అద్భుతంగా నటించాడు. అతని కెరీర్‌లో బెస్ట్ పెర్‌ఫార్మెన్స్‌గా 'లెనిన్'ని చెప్పొచ్చు. ఇక భాగ్యశ్రీబోర్సే తనదైన అందచందాలతోపాటు చక్కటి అభినయంతో కూడా ఆకట్టుకున్నది. ఈ సినిమాలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన వసంత్‌గా నటించిన ప్రమోద్ పంజు గురించి. తనది ఇందులో మేకవన్నె పులి లాంటిపాత్ర. మంచివాడిగా కనిపిస్తూ ఉన్నట్టుండి దుర్మార్గుడిగా ఎస్టాబ్లిష్ అయ్యే పాత్ర అది. ఆ పాత్రలో తన నిజంగా అదరహో అనిపించాడు. ఈ సినిమాతో అతనికి మంచి పేరు రావడం ఖాయం. ఇక శివాజీ, ఈశ్వరీరావు, రాంకీ.. ఇలా అంతా పరిధిమేర పాత్రలకు న్యాయంచేశారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com